ప్రజాశక్తి
శుక్రవారం 16 డిసెంబరు 2022



నేడు జోనల్ స్థాయి క్రీడా సంబరాలు

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

స్పోర్ట్స్ అథారిటీ ఆధ్వర్యాన ఈనెల 16న జోనల్ స్థాయి క్రీడా సంబరాలను నగరంలోని కోడి రామ్మూర్తి క్రీడా మైదానంలో నిర్వహిస్తున్నట్లు జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ సిఇఒ బి.వి ప్రసాదరావు ఒక ప్రకటనలో తెలిపారు. జోనల్ స్థాయిలోని పార్వతీపురం మన్యం, విజయనగరం, అల్లూరి సీతారామరాజు, అనకాపల్లి, విశాఖపట్నం, శ్రీకాకుళం జిల్లాల నుంచి క్రీడాకారులు హాజరు కానున్నారని పేర్కొన్నారు. వాలీబాల్ క్రీడలో బాలబాలికల విభాగంలో సిఎం ప్రైజ్‌మనీ టోర్నమెంట్‌ను నిర్వహించనున్నట్లు తెలిపారు. ఉదయం ఎనిమిది గంటలకు సంబరాలు ప్రారంభం కానున్నాయని పేర్కొన్నారు. జోనల్ పోటీలకు జిల్లాల వారీగా క్రీడాకారులు పాల్గొంటారని, గెలిచిన వారు రాష్ట్రస్థాయి పోటీలకు హాజరవుతారని తెలిపారు. ఈ పోటీల్లో పాల్గొనే క్రీడాకారులు తప్పనిసరిగా జగనన్న స్పోర్ట్స్ క్లబ్స్‌లో నమోదై ఉండాలని స్పష్టం చేశారు. ఈ అవకాశాన్ని క్రీడాకారులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

'గొర్లె'కు అసమ్మతి కిరణాలు



ఎచ్చెర్ల నియోజకవర్గం వైసిపిలో చోటుచేసుకుంటున్న పరిణామాలు ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్‌ను ఉక్కిరిబిక్కిరి చేస్తున్నాయి. స్థానిక ఎన్నికల నుంచి ప్రారంభమైన గ్రూపుల పోరు కొనసాగుతూనే ఉండగా, తాజాగా ఇంటి పోరును ఎదుర్కొంటున్నారు. సొంత బావమరిది, మేనల్లుడు వ్యవహారం ఆయనకు తలనొప్పిగా మారింది. ఇప్పటివరకు ఆయన వెంట తిరుగుతూ ఎమ్మెల్యే సొంత కుటుంబసభ్యులే తిరుగుబాటు మొదలుపెట్టారు. ఆయనకు వ్యతిరేకంగా ఎమ్మెల్యే టికెట్ కోసం పావులు కదుపుతున్నారు. ఎచ్చెర్ల ఎంపిపి మొదలవలస చిరంజీవితో ఎమ్మెల్యే మేనల్లుడు నాని మాట్లాడుతున్నట్లుగా సోషల్ మీడియాలో వైరల్ అవుతున్న ఓ ఆడియో పార్టీలో చర్చనీయాంశంగా మారింది.

ప్రజాశక్తి - శ్రీకాకుళం ప్రతినిధి

- ఎచ్చెర్ల వైసిపిలో తీవ్ర విభేధాలు
- ఇంటా బయటా తిరుగుబాటు
- ఎమ్మెల్యే ఒంటెత్తు పోకడలతో దూరమవుతున్న కేడర్
- కిరణ్ కుమార్‌కు వ్యతిరేకంగా పావులు కదుపుతున్న కుటుంబ సభ్యులు

ఎచ్చెర్ల నియోజకవర్గంలో ఎమ్మెల్యే కిరణ్‌కుమార్ ఏడాది కాలంగా తీవ్ర అసంతృప్తిని ఎదుర్కొంటున్నారు. నియోజకవర్గంలో అసంతృప్తి బీజాలు పడడానికి ఆయన స్వయంకృతాపరాధమే కారణమని సొంత పార్టీ నాయకులే చెప్తున్నారు. ఒంటెత్తు పోకడలు, కేడర్‌ను విస్మరించడం వంటి కారణాలతో రోజురోజుకూ అసంతృప్తిని మూటగట్టుకుంటున్నారు. 2019 ఎన్నికల్లో ఆయన గెలుపు కోసం పనిచేసిన వారంతా ఇప్పుడు దూరమయ్యారని అసమ్మతి నాయకులు చెప్తున్నారు. లావేరులో ఈ ఏడాది మార్చిలో నాలుగు మండలాల నాయకులు ఒకచోట సమావేశమై తిరుగుబావుటా ఎగురవేశారు. అక్కడ్నుంచి మొదలైన అసమ్మతి క్రమేణా పెరుగుతూ వచ్చింది. ఎచ్చెర్ల ఎంపిపి మొదలవలస చిరంజీవితో తలెత్తిన విభేదాలు రచ్చకెక్కాయి. ఎచ్చెర్లలో పార్టీ రెండు గ్రూపులుగా చీలిపోయింది. మండల సమావేశాల్లో ఎంపిపి తీసుకున్న నిర్ణయాలను కిరణ్ గ్రూపు సభ్యులు తీవ్రంగా వ్యతిరేకించి, తమకు అనుకూలంగా తీర్మానాలను ఆమోదించారు. అదీగాక ఎంపిపికి మద్దతుగా నిలిచారన్న కారణంతో ఎచ్చెర్ల ఎంపిడిఒ పావనిని సస్పెండ్ చేయించారని ఎంపిపి గ్రూపు నాయకులు చెప్తున్నారు. అప్పట్నుంచీ ఎంపిపి చిరంజీవి ఎమ్మెల్యేపై రగిలిపోతున్నట్లు తెలిసింది. ఎచ్చెర్ల జెడ్‌పిటిసి హేమమాలిని రెడ్డితోనూ ఎమ్మెల్యే కిరణ్ కుమార్‌కు తీవ్ర విభేదాలు నెలకొన్నాయి. రణస్థలం, ఎచ్చెర్లలో అసంతృప్తి బయటపడగా... జి.సిగడాం, లావేరులో చాప కింద నీరులా సాగుతున్నట్లు తెలుస్తోంది. కొందరు నాయకులు టిడిపితో టచ్‌లో ఉన్నట్లు సమాచారం.

కేడర్‌ను విస్మరించడమే కారణమా?

ఎచ్చెర్ల నియోజకవర్గంలో పార్టీలో అసంతృప్తికి దారితీయడానికి ఎమ్మెల్యే కిరణ్ కుమార్ వ్యవహార శైలే ప్రధాన కారణమని తెలుస్తోంది. స్థానిక ఎన్నికల్లో నాయకులు, కేడర్ అభిప్రాయాలను తీసుకోకుండా ఏకపక్షంగా వ్యవహరించడంతో వారంతా అసంతృప్తితో రగిలిపోతున్నారు. పార్టీ నాయకులను పక్కనపెట్టి, ఆర్థిక వ్యవహారాలను చక్కబెట్టుకోవడానికే ప్రాధాన్యం ఇచ్చారన్న ఆరోపణలను ఎదుర్కొంటున్నారు. ఎన్నికల ముందు రణస్థలం మండలంలో గతంలో టిడిపిలో ఉన్న ఓ నాయకుడి అంతు చూస్తానని చెప్పి, బిజెపిలో చేరిన ఆ నాయకుడితోనే రియల్ ఎస్టేట్ వ్యాపారాలు సాగించారన్న కోపం కార్యకర్తల్లో ఉంది. స్థానిక ఎన్నికల్లో రణస్థలం మండలంలో ఎంపిటిసి, సర్పంచ్ బిజెపి గెలిచేందుకు లోపాయికారీగా మద్దతు ఇచ్చారని సొంత పార్టీ నాయకులు బాహాటంగా చెప్తున్నారు.

సొంత కుటుంబ సభ్యులే తిరుగుబాటు

నియోజకవర్గంలో ఎమ్మెల్యే పనితీరుపై సర్వే చేసిన ప్రశాంత్ కిషోర్ టీమ్, ఆయన పనితీరు బాగాలేని అధిష్టానానికి నివేదించినట్లు తెలిసింది. వచ్చే ఎన్నికల్లో ఇక్కడి అభ్యర్థిని మారుస్తారన్న చర్చ బలంగా వినిపిస్తోంది. దీంతో ఇప్పటివరకు నమ్మిన బంటుల్లా ఉన్న ఎమ్మెల్యే బావమరిది పిన్నింటి సాయి, మేనల్లుడు నాని సైతం ఆయనకు వ్యతిరేకంగా గ్రూపులు నడపుతున్నట్లు తెలుస్తోంది. అదీగాక ఎమ్మెల్యే టిక్కెట్ రేసులో తామూ ఉన్నామని ప్రచారం చేసుకుంటున్నట్లు సమాచారం. ఎచ్చెర్ల ఎంపిపి చిరంజీవితో కిరణ్ మేనల్లుడు నాని మాట్లాడుతున్నట్లుగా సోషల్ మీడియాలో ఆడియో ఒకటి వైరల్ అవుతోంది. నియోజవర్గంలో పికె టీమ్ మీ దగ్గరకు వస్తుందని, ప్రాబబుల్స్ జాబితాలో మేం ముగ్గురున్నామని, నా గురించి అడిగితే గుడ్ ఒపీనియన్ చెప్పాలని నాని కోరినట్లుగా ఉంది. ఎమ్మెల్యే మీకేం అవుతారని అటు నుంచి వాయిస్ వచ్చింది. తాను మేనల్లుడిని అవుతానని నాని చెప్పుకొచ్చారు. ఎమ్మెల్యేను ఇప్పుడు ఎవరూ కాదంటున్నారని, అతని మేనల్లుడు సాయే చెప్తున్నారని నాని చెప్తున్నట్లుగా ఉంది. కిరణ్‌కు అప్రతిష్ట రావడానికి సాయి కారణమని, తనను, కేడర్‌ను సాయి ఇబ్బందులు పెట్టారని చెప్పుకొచ్చారు. కిరణ్‌కు టికెట్ రాదని అందరూ అంటున్నారని, అలాంటప్పుడు తానెందుకు ప్రయత్నించకూడదని నాని ప్రశ్నించినట్లుగా ఉంది. ఎమ్మెల్యే కూడా నన్ను ఇబ్బంది పెట్టారు, నేనైతే మనస్ఫూర్తిగా పనిచేయలేను. అతనికి టికెట్ రాదని సాయి అందరికీ చెప్తున్నాడు. ప్రత్యామ్నాయం అడిగితే మాత్రం మీరు ఆలోచించి చెప్పాలని అని అర్థించినట్లు ఉంది. ఈ ఆడియో ఎమ్మెల్యే కిరణ్ కుమార్ కుటుంబంలో నెలకొన్న ఇంటి పోరును తేటతెల్లం చేస్తోంది.

పార్టీపై పట్టు కోల్పోతున్న ఎమ్మెల్యే

ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్ పార్టీపై క్రమేణా పట్టు కోల్పోతున్న పరిస్థితి నెలకొంది. నియోజకవర్గ నాయకులు తిరుగుబాటు చేయడంతో పాటు సొంత కుటుంబసభ్యులు సైతం ఆయనకు వ్యతిరేకంగా టికెట్ కోసం పావులు కదుపుతున్నారు. పార్టీపై పట్టు సాధించడానికి తన వైఖరిని కొంతవరకు మార్చుకున్నట్లు తెలిసింది. కేడర్‌ను కలుపుకొని వెళ్లేలా నిర్ణయాలు తీసుకుంటున్నట్లు నాయకులు చెప్తున్నారు. అయితే ఇప్పటికే జరగాల్సిన నష్టం జరిగిపోయిందనే చర్చ సాగుతోంది. ఎచ్చెర్ల నియోజకవర్గంలో ఇంటా బయటా నెలకొన్న అసంతృప్తి, విభేదాలపై పార్టీ అధిష్టానం దృష్టిసారించకపోతే తీవ్రంగా నష్టపోతామన్న ఆందోళనలో కేడర్ ఉంది.




సమావేశంలో మాట్లాడుతున్న తేజేశ్వరరావు

2 నుంచి సిఐటియు రాష్ట్ర మహాసభలు

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

సిఐటియు 16వ రాష్ట్ర మహాసభలు జనవరి రెండు నుంచి నాలుగో తేదీ వరకు పశ్చిమగోదావరి జిల్లా భీమవరంలో నిర్వహించనున్నట్లు ఆ సంఘ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సిహెచ్.అమ్మన్నాయుడు, పి.తేజేశ్వరరావు వెల్లడించారు. మహాసభలను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. నగరంలోని సిఐటియు జిల్లా కార్యాలయంలో సంఘ జిల్లా కార్యవర్గ సమావేశాన్ని గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మహాసభల సందర్భంగా నిర్వహించే బహిరంగ సభకు కేరళ ముఖ్యమంత్రి పినరయి విజయన్ హాజరు కానున్నట్లు తెలిపారు. జిల్లా నుంచి పెద్దసంఖ్యలో కార్మికులు హాజరై మహాసభల ప్రదర్శనలో పాల్గొనాలని కోరారు. జిల్లాలో కార్మిక, కర్షక, కాంట్రాక్టు, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగుల సమస్యలపై సమిష్టిగా పోరాడుతున్నట్లు తెలిపారు. చిలకపాలెం టోల్‌ప్లాజాను ఎత్తివేసి అక్కడ వస్తున్న ఆదాయాన్ని నాతవలస, మడపాం టోల్‌ప్లాజాల్లో సర్దుబాటు చేసినట్లుగానే, అక్కడ పనిచేసి రోడ్డున పడిన 106 మంది కార్మికులనూ సర్దుబాటు చేయాలని డిమాండ్ చేశారు. లేకుంటే తగిన పరిహారం చెల్లించాలన్నారు. మందస రైస్‌మిల్లు కార్మికులు ఆరు నెలలుగా పోరాడుతున్నా ప్రభుత్వం, అధికారులు పట్టించుకోవడం లేదని విమర్శించారు. పిఎఫ్, ఇఎస్ఐ వంటి చట్టబద్ధమైన సౌకర్యాలు అమలు చేయడం లేదని చెప్పారు. మందస, కోటబొమ్మాళి రైస్‌మిల్లు కార్మికుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. శ్యామ్‌పిస్టన్స్, యునైటెడ్ బ్రేవరీస్ కార్మికులకు పూర్తిస్థాయి పనిదినాలు లేకపోవడం వల్ల తీవ్ర ఆర్థిక ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అంగన్వాడీ, ఆశా, మధ్యాహ్న భోజన పథకం కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించాలని, రిటైర్మెంట్ బెనిఫిట్స్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. జీడి కార్మికులకు కనీస వేతనాలు అమలు కావడం లేదన్నారు. కాంట్రాక్టు, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులను రెగ్యులర్ చేయాలని డిమాండ్ చేశారు. బిజెపి అధికారంలోకి వచ్చాక కార్మిక, ఉద్యోగుల హక్కులు హరించే విధానాలు అవలంభిస్తోందని ధ్వజమెత్తారు. ఉద్యమాలపై నిర్బంధం పెరిగిందని, ప్రశ్నించే గొంతును నొక్కేస్తున్నారని విమర్శించారు. రాష్ట్ర ప్రభుత్వం 70 రంగాల్లోని కార్మికుల వేతనాలను కనీస 15 ఏళ్లుగా సవరించకపోవడంతో 50 లక్షల మంది కార్మికులు తీవ్ర శ్రమ దోపిడీకి గురవుతున్నారని, అతి తక్కువ వేతనాలతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో పారిశ్రామికాభివృద్ధి కుంటుపడిందని విమర్శించారు. సమావేశంలో సిఐటియు జిల్లా నాయకులు కె.నాగమణి, ఎ.సత్యనారాయణ, ఎన్.వి రమణ, ఎన్.గణపతి, డి.సుధ, ఎ.మహాలక్ష్మి, ఎం.ఆదినారాయణమూర్తి, కె.సూరయ్య, ఎస్.లక్ష్మీనారాయణ, హెచ్.ఈశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

3022 డూప్లికేట్ ఓటర్లు



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్, జెసి, డిఆర్‌ఒ

- పరిశీలించి తొలగించాలి
- సకాలంలో పెండింగ్ క్లయిమ్‌లు పూర్తి
- రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముఖేష్ కుమార్ మీనా

ప్రజాశక్తి - శ్రీకాకుళం

జిల్లాలో సుమారు 3022 వరకు డూప్లికేట్ ఓటర్లు ఉన్నట్లు గుర్తించామని, వాటిని నిశితంగా పరిశీలించి ఈనెల 17వ తేదీ లోగా నివేదిక పంపాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముఖేష్ కుమార్ మీనా అధికారులను ఆదేశించారు. ఎమ్మెల్సీ ఓటర్లకు సంబంధించి డూప్లికేట్ ఓటర్లు ఉండరాదని స్పష్టం చేశారు. నవంబరు 23వ తేదీ నాటికి ప్రచురించబడిన డ్రాఫ్ట్ పబ్లికేషన్ పంపడమైందని, వాటిలో డూప్లికేట్స్‌ను తొలగించేందుకు ప్రత్యేకంగా సాఫ్ట్‌వేర్‌ను రూపొందించినట్లు తెలిపారు. ఎస్-ఎస్ఆర్ 2023, పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి పట్టభద్రుల ఓటర్ల క్లయిమ్‌లపై కలెక్టర్, జాయింట్ కలెక్టర్‌తో గురువారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఓటర్ల నమోదు కార్యక్రమంలో పెండింగ్‌లో ఉన్న క్లయిమ్‌లను షెడ్యూల్ ప్రకారం ఈనెల 25వ తేదీ లోగా పూర్తి చేయాలన్నారు. జిల్లాలో చేపట్టిన ప్రత్యేక ఓటరు నమోదు కార్యక్రమంలో ఉన్న పెండింగ్ క్లయిమ్‌లను ఈనెల 26లోగా పూర్తి చేయాలని, పట్టభద్రుల ఎమ్మెల్సీ ఓటర్ల నమోదు కార్యక్రమంలో పెండింగ్‌లో ఉన్న క్లయిమ్‌లను ఈనెల 25వ తేదీ లోగా పూర్తి చేయాలని చెప్పారు. జిల్లాలో ఇప్పటికే 20 వేల క్లయిమ్‌లను క్లియర్ చేశారని, ఇంకా 19 వేల వరకు పెండింగ్‌లో ఉన్నాయన్నారు. వాటిని నిర్దేశించిన గడువులోగా పూర్తి చేయాలన్నారు. పిఎస్ఇ 70 వేలకు గానూ 64 వేలు పూర్తి చేయడంపై అధికారులను అభినందించారు. ఎపిక్ ఆధార్ నమోదులో 62 శాతం పూర్తి చేశారని, 2023 మార్చి నెలాఖరు వరకు గడువు ఉన్నందున ఈలోగా మిగిలిన వాటిని పూర్తి చేయాలని ఆదేశించారు. జిల్లాలో పెండింగ్‌లో ఉన్న ఎమ్మెల్సీ క్లయిమ్‌లు ఏడు వేలను షెడ్యూల్ ప్రకారం 25 లోగా పంపాలని సూచించారు. కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్, జాయింట్ కలెక్టర్ ఎం.నవీన్, జిల్లా రెవెన్యూ అధికారి ఎం.రాజేశ్వరి, ఇతర అధికారులు తదితరులు పాల్గొన్నారు.

కస్టోడియన్ అధికారిదే ధాన్యం దించే బాధ్యత

ప్రజాశక్తి - జలుమూరు

రైతు భరోసా కేంద్రం నుంచి రైసు మిల్లు వద్దకు పంపించిన ధాన్యాన్ని దించే బాధ్యత కస్టోడియన్ అధికారిదేనని స్టేట్ స్పెషల్ టీమ్ డిప్యూటీ కలెక్టర్ బి.నారదముని స్పష్టం చేశారు. మండలంలోని రైస్ మిల్లుల యజమానులు రెండు నుంచి ఐదు కేజీల వరకు అదనంగా తీసుకుంటున్నారని వస్తున్న ఫిర్యాదుల మేరకు ఆయన మండలంలో పర్యటించారు. పాగోడు రైతు భరోసా కేంద్రాన్ని గురువారం పరిశీలించి సిబ్బందికి, ధాన్యం కొనుగోలు ఏజెన్సీకి సూచనలు చేశారు. ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగానే ధాన్యం మిల్లులకు ఇవ్వాలన్నారు. ఎక్కడైనా మిల్లర్లు అదనంగా ధాన్యాన్ని తీసుకుంటే వెంటనే సంబంధిత అధికారులకు తెలియజేయాలని రైతులకు సూచించారు. రైతు భరోసా కేంద్రంలోని గ్రామ వ్యవసాయ సహాయకులు, టెక్నికల్ అసిస్టెంట్లు ధాన్యాన్ని కొనుగోలు చేస్తామనే భరోసా రైతులకు ఇవ్వాలన్నారు. 17 శాతం కన్నా తక్కువ తేమ ఉన్న ధాన్యాన్ని వెంటనే మిల్లులకు పంపించాలని సూచించారు. రైస్ మిల్లర్ల యాజమాన్యాలు ఏమైనా ఇబ్బందులకు గురి చేస్తే వెంటనే తహశీల్దార్, సివిల్ సప్లై డిప్యూటీ తహశీల్దార్లను సంప్రదించాలన్నారు. ఆయన వెంట ఇన్‌ఛార్జి తహశీల్దార్ పి.శ్రీనివాస్, ఎఒ కె.సురేష్, సిఎస్‌డిటి పి.గణేష్, సర్పంచ్ మన్మథరావు, ఆర్‌బికె సిబ్బంది ఉన్నారు.

ప్రజాస్వామ్యానికి విష వ్యూహకర్తల ముప్పు

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్



మాట్లాడుతున్న గుండ అప్పలసూర్యనారాయణ

ప్రజా చైతన్యం కోసం ప్రతి రాజకీయ పార్టీ ప్రజాస్వామ్యయుతంగా పనిచేయడం గురుతర బాధ్యత అని మాజీ మంత్రి, టిడిపి సీనియర్ నాయకులు గుండ అప్పల సూర్యనారాయణ అన్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో కొందరు వ్యూహకర్తల విష వ్యూహాల వల్ల ప్రజాస్వామ్యానికే ముప్పు వాటిల్లే పరిస్థితి నెలకొంటోందని ఆవేదన వ్యక్తం చేశారు. నగరంలోని అరసవల్లిలో గల ఆయన నివాసంలో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కర్తవ్య నిర్వహణలో భాగమంటూ విష వ్యూహాలతో ప్రజాస్వామ్యానికి ముప్పు తెచ్చే వ్యూహకర్తల తీరును ముక్తకంఠంగా ప్రజలంతా ఖండించాలన్నారు. హిట్లర్ వ్యూహకర్త గ్లోబెల్ సలహాలను పాటించడం వల్లే ప్రపంచ యుద్ధానికి కారణమైందని గుర్తుచేశారు. ప్రజాస్వామ్యాన్ని, రాజకీయ వ్యవస్థలను బలహీనపరిచే విష వ్యూహాల వల్ల దేశ ప్రయోజనం దెబ్బతింటోందన్నారు. చంద్రబాబు పాలనను వక్రీకరిస్తూ విష వ్యూహాలను వ్యూహకర్త ప్రశాంత్ కిషోర్ ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లారని, దేశంలో కాంగ్రెస్ పార్టీని అస్థిరపరిచిన ఘనత అయనదేనన్నారు. ఇటువంటి వ్యూహాలు ప్రజాస్వామ్య సంప్రదాయం కాదన్నారు. ప్రజాస్వామ్యానికి ముప్పు వాటిల్లే రీతిలో వ్యూహాలు రచించే వ్యక్తులపై చర్యలు తీసుకోవాలన్నారు. విష వ్యూహాలు చరిత్రలో పునరావృతం కాకుండా విజ్ఞులైన ప్రజలు, ప్రజాస్వామ్యవాదులు ఆలోచించాలన్నారు.

గడువులోగా ఇళ్ల నిర్మాణాలు పూర్తి

శాసనసభ స్పీకర్ తమ్మినేని సీతారాం

ప్రజాశక్తి - ఆమదాలవలస



గాజులకొల్లివలస లేఅవుట్‌ను పరిశీలిస్తున్న స్పీకర్ సీతారాం

గడువు లోగా ఇళ్ల నిర్మాణాలను లబ్ధిదారులు పూర్తి చేయాలని శాసనసభ స్పీకర్ తమ్మినేని సీతారాం అన్నారు. మున్సిపాల్టీ పరిధిలోని లబ్ధిదారులకు కేటాయించిన గాజులకొల్లివలస లేఅవుట్‌ను గురువారం పరిశీలించారు. గృహ నిర్మాణ లబ్ధిదారుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇళ్ల నిర్మాణాలు త్వరితగతిన పూర్తయ్యే విధంగా అధికార యంత్రాంగం లబ్ధిదారులకు అవగాహన కల్పించి పూర్తి చేయాలన్నారు. ఇక్కడ నిర్మిస్తున్నది జగనన్న కాలనీలు కాదని, కొత్తగా గ్రామాలనే ప్రభుత్వం తయారు చేస్తోందని చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం 1.70 లక్షల మంది గృహ నిర్మాణ లబ్ధిదారులకు రూ.840 కోట్ల బిల్లులను చెల్లించిందన్నారు. అందులో భాగంగా సిమెంట్, ఐరన్ తదితర నిర్మాణ సామగ్రికి రూ.132 కోట్లు చెల్లించిందని తెలిపారు. ఈ ఆర్థిక సంవత్సరానికి గృహ నిర్మాణాల కోసం రూ.6,495 కోట్లు ఖర్చు చేశామన్నారు. రాష్ట్రంలో 31 లక్షల మంది లబ్ధిదారులకు పట్టాలు ఇచ్చామని, అందులో 15 లక్షల ఇళ్ల నిర్మాణాలకు శంకుస్థాపన పూర్తి చేసుకుని నిర్మాణ దశలో ఉన్నాయని తెలిపారు. గృహ నిర్మాణాలను త్వరితగతిన పూర్తి చేసేందుకు చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో హౌసింగ్ పీడీ గణపతి, మెప్మా పీడీ కిరణ్ కుమార్, మున్సిపల్ కమిషనర్ ఎం.రవిసుధాకర్, వైసిపి నాయకులు బొడ్డేపల్లి రమేష్ కుమార్, ఎ.ఉమామహేశ్వరరావు, దుంపల శ్యామలరావు, పిఎసిఎస్ అధ్యక్షులు జి.శ్రీనివాసరావు, పలువురు అధికారులు, నాయకులు పాల్గొన్నారు.

అమరజీవి పొట్టి శ్రీరాములు

కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్

ప్రజాశక్తి - శ్రీకాకుళం



పొట్టి శ్రీరాములు చిత్రపటానికి నివాళ్లర్పిస్తున్న కలెక్టర్, జెసి

ఆంధ్ర రాష్ట్ర సాధన కోసం ఆమరణ నిరాహార దీక్ష చేసి, ప్రాణాలర్పించిన పొట్టి శ్రీరాములు అమరజీవిగా మనందరి మదిలో చిరస్థాయిగా మిగిలారని కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్ అన్నారు. పొట్టి శ్రీరాములు 70వ వర్ధంతి సందర్భంగా గురువారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో పొట్టి శ్రీరాములు చిత్రపటానికి పూలమాలలు వేసి కలెక్టర్ నివాళ్లర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భాషా ప్రయుక్త రాష్ట్రాల ఏర్పాటుకు విశేష కృషి చేసిన మహా పురుషుడు పొట్టి శ్రీరాములు అని అన్నారు. మహాత్మాగాంధీ బోధించిన సత్యం, అహింస, హరిజనోద్ధరణ అనే ఆశయాల కోసం పనిచేసిన మహనీయుడు శ్రీరాములు అని తెలిపారు. ఉప్పు సత్యాగ్రహం, క్విట్ ఇండియా ఉద్యమాల్లో పాల్గొన్న మహోన్నతుడు అని అన్నారు. ఆమరణ నిరాహార దీక్ష చేసి ఆంధ్ర రాష్ట్ర సాధన కోసం తమ ప్రాణాలు అర్పించిన ధీరోదాత్తుడు అని కొనియాడారు. ఆయన పేరుతో జిల్లా ఉండడం ఆయన త్యాగాలకు గుర్తుగా నిలుస్తాయన్నారు. అటువంటి మహనీయుడుని ప్రతిఒక్కరూ స్మరించుకోవాల్సిన తరుణమిదని గుర్తుచేశారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ ఎం.నవీన్, జిల్లా రెవెన్యూ అధికారి ఎం.రాజేశ్వరి, ఇతర జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రంలో అరాచక పాలన

టిడిపి జిల్లా అధ్యక్షుడు కూన రవికుమార్

ప్రజాశక్తి - పొందూరు

రాష్ట్రంలో అరాచక పాలన సాగిస్తున్న వైసిపి ప్రభుత్వాన్ని గద్దె దింపాల్సిన సమయం ఆసన్నమైందని తెలుగుదేశం పార్టీ జిల్లా అధ్యక్షులు కూన రవికుమార్ అన్నారు. 'ఇదేం ఖర్మ మన రాష్ట్రానికి' కార్యక్రమాన్ని మండలంలోని గోరింటలో గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం సంక్షేమ పథకాలను అందజేసేందుకు కరెంటు బిల్లుతో లింకు పెట్టి సామాన్యులకు అవి దక్కకుండా అన్యాయం చేస్తోందని విమర్శించారు. వైసిపి ప్రభుత్వంలో ప్రజలు అధిక ధరలతో చాలా ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. చెత్త పన్ను, మద్యం, ఇసుక ధరలు, నిత్యావసర సరుకుల ధరల పెంపుతో సామాన్యులు జీవనం సాగించలేని పరిస్థితులు రాష్ట్రంలో నెలకొన్నాయని విమర్శించారు. అనంతరం గ్రామంలోని ఇంటింటికీ వెళ్లి ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో టిడిపి మండలం అధ్యక్షులు చిగిలిపల్లి రామ్మోహనరావు, సర్పంచ్ చింతాడ శ్రీలక్ష్మి, టిడిపి నాయకులు చింతాడ కృష్ణవాసుదేవరావు, సీపాన శ్రీరంగనాయకులు, అన్నెపు రాము, బలగ శంకరభాస్కరరావు, బాడాన శేషగిరి తదితరులు పాల్గొన్నారు.

వినియోగదారుల ప్రయోజనాలపై అవగాహన అవసరం

ప్రజాశక్తి - శ్రీకాకుళం

ఈనెల 24న నిర్వహించనున్న జాతీయ వినియోగదారుల దినోత్సవ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని జిల్లా వినియోగదారుల, వివాదాల పరిష్కార కమిషన్ చైర్మన్ రఘుపాత్రుని చిరంజీవి పిలుపునిచ్చారు. జాతీయ వినియోగదారుల దినోత్సవ నిర్వహణపై కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో జాయింట్ కలెక్టర్ ఎం.నవీన్‌తో కలిసి సంబంధిత అధికారులతో గురువారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వినియోగదారుల ప్రయోజనాలు, వారి హక్కులు, బాధ్యతల గురించి ప్రజల్లో అవగాహన కల్పించడానికి ఏటా డిసెంబర్ 24న కొత్త నినాదంతో జాతీయ వినియోగదారుల దినోత్సవాన్ని నిర్వహించుకుంటున్నట్లు తెలిపారు. ఈ ఏడాది వినియోగదారుల కమిషన్‌లో కేసులను సమర్థవంతంగా పరిష్కరించడం అనే నినాదంతో వినియోగదారుల దినోత్సవాన్ని నిర్వహించుకోనున్నట్లు వివరించారు. వినియోగదారుల కేసులను సమర్థవంతంగా పరిష్కరించడంపై స్వచ్ఛంద సంస్థలు, అధికారులు ముందుకు రావాలని కోరారు. ఈ విషయమై ప్రజల్లో అవగాహన కలిగేలా సెమినార్లు, వర్క్‌షాప్‌లు, ఇతర పోటీలు నిర్వహించాలని సూచించారు.

ఈనెల 19న ఉదయం పది గంటల నుంచి డివిజన్లలో, 20న జిల్లాస్థాయిలో పాఠశాల స్థాయిలో వ్యాసరచన, వక్తృత్వ పోటీలను నిర్వహించాలని జాయింట్ కలెక్టర్ ఎం.నవీన్ జిల్లా విద్యాశాఖాధికారులను ఆదేశించారు. 20న కళాశాల స్థాయిలో ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వ పోటీలు నిర్వహించాలన్నారు. అదేరోజు పురుషుల డిగ్రీ కళాశాలలో సెమినార్ ఏర్పాటు చేయాలని సంబంధిత కళాశాలల ప్రిన్సిపాళ్లు కె.శ్రీరాములు, పి.సురేఖను ఆదేశించారు. సమావేశంలో జిల్లా పౌర సరఫరాల అధికారి డి.వి.రమణ, వినియోగదారుల ఫోరం అధ్యక్షులు బగాది రామ్మోహనరావు, వినియోగదారుల సంఘాల సమాఖ్య రాష్ట్ర అధ్యక్షులు ఎల్.వెంకటాచలం, నగరపాలక సంస్థ కమిషనర్ చల్లా ఓబులేషు, లీగల్ మెట్రాలజీ అసిస్టెంట్ కంట్రోలర్ ఎస్.విశ్వేశ్వరరావు, డ్రగ్ కంట్రోల్ ఎడి కె.కళ్యాణి, ఫుడ్ సేఫ్టీ ఎడి కె.లక్ష్మి, పలువురు అధికారులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

ఆరు గంటలు పనిచేయాల్సిందే..

డ్వామా పీడీ జి.వి చిట్టిరాజు



ఉపాధి కూలీలతో మాట్లాడుతున్న పీడీ చిట్టిరాజు

ప్రజాశక్తి - జలుమూరు

ఉపాధి హామీ కూలీలు రోజుకు ఆరు గంటలు తప్పనిసరిగా పనిచేయాలని జిల్లా నీటి యాజమాన్య సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్ జి.వి చిట్టిరాజు స్పష్టం చేశారు. మండలంలోని జోనంకి పంచాయతీ పరిధిలో చేపడుతున్న చెరువు పనులను గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రెండు పూటలా కనీసం ఆరు గంటల పాటు పనులు చేయడం ద్వారా గరిష్ట కూలి రూ.250 పొందవచ్చన్నారు. ఉపాధి హామీలో కూలీలే యజమానులని చెప్పారు. జాబ్‌కార్డు ఉన్న కుటుంబాలు వంద రోజుల పాటు పనులకు రావడం ద్వారా ఆర్థిక భద్రతను పొందాలన్నారు. అన్ని గ్రామాల్లోనూ పనులు చేపట్టాలని, ఇందుకుగానూ కూలీలను పనులకు వచ్చేలా ప్రోత్సహించాలని సిబ్బందిని ఆదేశించారు. గ్రామీణ ప్రాంతాల్లోని ప్రజలు ఉపాధి పనులను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. మేట్ల నియామకం ప్రక్రియ పూర్తి చేయాలని, ఈ జాబితాను జిల్లా కార్యాలయానికి అందజేయాలని సూచించారు. మండలాల్లో కూలి చెల్లింపుల్లో జాప్యం లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు. సుపరిపాలన అంశాలపై సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని సూచించారు. చనిపోయిన మొక్కల స్థానంలో కొత్త మొక్కలు నాటే కార్యక్రమాన్ని తక్షణం పూర్తి చేయాలని సిబ్బందిని ఆదేశించారు.

నేమ్ బోర్డులపై ఆరా..

ఉపాధి హామీలో పనులు చేపట్టిన చోట్ల ఏర్పాటు చేయాల్సిన బోర్డులపై డ్వామా పీడీ చిట్టిరాజు ఆరా తీశారు. మండలంలో సామాజిక తనిఖీల అనంతరం అక్టోబర్ 27వ తేదీన నిర్వహించిన ప్రజావేదికలో పనుల వద్ద బోర్డులు ఏర్పాటు చేయలేదని చెప్పారు. వారం రోజుల్లోగా పనుల వద్ద బోర్డులు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. నేమ్ బోర్డుల ఏర్పాటులో నిధుల దుర్వినియోగం జరిగినట్లు వచ్చిన ఆరోపణలపై ఆరా తీశారు. ప్రస్తుతం చేపడుతున్న పనుల వద్ద తప్పనిసరిగా బోర్డులు ఏర్పాటు చేయాలన్నారు. కార్యక్రమంలో ఎంపిడిఒ జి.వి రవికుమార్, పంచాయతీ విస్తరణ అధికారి పి.ఉమామహేశ్వరరావు, ఎపిఒ నారాయణరావు, ఇసి అప్పలస్వామి, ఉపాధి హామీ సిబ్బంది పాల్గొన్నారు.

రేపు బ్యాడ్మింటన్ పోటీలు

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

నగరంలోని శాంతినగర్ ఇండోర్ బ్యాడ్మింటన్ స్టేడియంలో జిల్లా స్థాయి బ్యాడ్మింటన్ పోటీలు ఈ నెల 18న నిర్వహిస్తున్నట్లు అసోసియేషన్ కార్యదర్శి రామారావు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పోటీల్లో అండర్-14, అండర్-17 విభాగాల సింగిల్స్, డబుల్స్ పోటీలు, మెన్స్ విభాగంలో డబుల్స్ పోటీలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ పోటీల్లో పాల్గొనదలచిన వారు ఎంట్రీలను ఈ నెల 17న సాయంత్రం ఐదు గంటలలోపు నమోదు చేసుకోవాలన్నారు. ఎంట్రీలను ఫోన్ నంబరు 7075363777, 7680033009 పంపాలని సూచించారు. పోటీల్లో పాల్గొన్న క్రీడాకారులకు మధ్యాహ్నం భోజనం సదుపాయం ఉంటుందన్నారు. విన్నర్స్, రన్నర్స్‌తో పాటు 3, 4 స్థానాల్లో గెలుపొందిన క్రీడాకారులకు క్యాష్‌ప్రైజ్‌తో పాటు మెమెంటోలను అందజేస్తామని తెలిపారు. అండర్-14, 17 విభాగాల్లో ఎంట్రీ ఫీజు రూ.వంద చెల్లించాల్సి ఉంటుందన్నారు. మెన్స్ విభాగంలో ఎంట్రీ ఫీజు రూ. 400 చెల్లించాల్సి ఉంటుందని తెలిపారు.


కబడ్డీ ఆడుతున్న బాలికలు

బాలికలు అన్ని రంగాల్లో రాణించాలి

ప్రజాశక్తి- పలాస

బాలికలు అన్నీ రంగాల్లోనూ రాణించాలని, క్రీడలు అవసరమని బ్రాహ్మణతర్ల ఉన్నత పాఠశాల హెచ్‌ఎం వైకుంఠరావు అన్నారు. మండలంలోని బ్రాహ్మణతర్ల ఉన్నత పాఠశాల ఆవరణలో జరుగుతున్న 66వ జిల్లా ఒకటవ జోన్ అంతర పాఠశాలల బాల బాలికల జూనియర్స్, సీనియర్స్ ఆటల పోటీలు(గ్రిగ్స్) మూడవ రోజు గురువారం పలాస, ఇచ్ఛాపురం నియోజకవర్గాల్లోని ఏడు మండలాలకు చెందిన బాలికలకు నిర్వహించారు. పాఠశాల హెచ్‌ఎం కొర్ల వైకుంఠరావు ఆటల పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పురుషులతో పాటు, స్త్రీలు అన్ని రంగాల్లోనూ రాణించాలని అన్నారు. కబడ్డీ, వాలీబాల్, బ్యాడ్మింటన్ పోటీలు హోరాహోరీగా సాగాయి. కార్యక్రమంలో వ్యాయామ సంఘ అధ్యక్షులు పద్మనాభరెడ్డి, వ్యాయామ ఉపాధ్యాయులు పద్మలోచనం, తవిటయ్య, హరిబాబు, ఉపాధ్యాయ సిబ్బంది పాల్గొన్నారు.

వాలంటీర్ల ఆందోళన

నౌపడ : ఓ పత్రికలో వాలంటీర్ల వ్యవస్థను కించపరుస్తూ వార్తల రాశారని సంతబొమ్మాళి మండలం భావనపాడులో గురువారం వాలంటీర్లు ఆందోళన చేశారు. ఈ సందర్భంగా పత్రికా అధినేత దిష్టిబొమ్మను దగ్ధం చేశారు. వాలంటీర్లకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో భావనపాడు సచివాలయ పరిధిలో పనిచేస్తున్న వాలంటీర్లు పాల్గొన్నారు.

ప్రభుత్వ వైఖరిని ఎండగట్టాలి


శ్రీకాకుళం అర్బన్ : నిరసనలో పాల్గొన్న లక్ష్మీదేవి

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

నగరంలోని 13వ వార్డులో ఉన్న పెద్దరెల్లివీధి, వైశ్యపు వీధుల్లో టిడిపి నాయకులు ఇదేం ఖర్మ మన రాష్ట్రానికి పేరుతో నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. మాజీ ఎమ్మెల్యే గుండ లక్ష్మీదేవి పాల్గొని మాట్లాడారు. ఎన్నికల ముందు గ్లోబల్ ప్రచారంతో ప్రజలను మభ్యపెట్టి ఓట్లు దండుకున్న జగన్మోహన్‌రెడ్డి అధికారంలోకి వచ్చిన తర్వాత అన్ని తరగతులకూ అన్యాయం చేస్తున్నారన్నారు. ఈ మూడున్నరేళ్లలో పేదలను, నిరుద్యోగ యువతను మోసం చేశారన్నారు. కార్యక్రమంలో కళ్యాణ వెంకటరావు, జఠరగుల జగన్, నగర టిడిపి అధ్యక్షులు మాదారపు వెంకటేష్, ఉపాధ్యక్షులు పి.ఎం.జె.బాబు, తోణంగి వెంకన్న యాదవ్ పాల్గొన్నారు.

టెక్కలి రూరల్: రాష్ట్రంలో వైసిపి పాలనలో ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను గ్రామాల్లో ప్రచారం చేసి, ప్రభుత్వ వైఖరిని ఎండగట్టాలని టిడిపి మండల అధ్యక్షులు బగాది శేషగిరిరావు అన్నారు. గురువారం మండలంలోని లింగాలవలస పంచాయతీ బలరాంపురంలో ఇదేం ఖర్మ రాష్ట్రానికి కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా గ్రామంలో ర్యాలీ చేపట్టారు. ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ వైఫల్యాలను వివరించారు. కార్యక్రమంలో బగాది శేషగిరి, మట్ట పురుషోత్తం, హెచ్.రామకృష్ణ, ఎం.రాము, కోళ్ల లవకుమార్, దల్లి ప్రసాద్‌రెడ్డి, రేయి ప్రదీప్, కోళ్ల కామేష్, ఎం.మధు, బి.సునీల్‌కుమార్, కిరణ్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

కవిటి: మండలంలోని కవిటి కొత్తూరులో గురువారం సాయంత్రం టిడిపి నాయకులు ఇదేం ఖర్మ రాష్ట్రానికి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికీ తిరుగుతూ ప్రభుత్వ వైఫల్యాలు, ప్రజలపై మోపిన భారాలను వివరించారు. అలాగే రాష్ట్రంలో ప్రస్తుతం ప్రభుత్వ పాలన ఎలా ఉంది, నిరుద్యోగ సమస్య, మద్యపాన నిషేధం, ధరల పెరుగుదల, గ్రామాల అభివృద్ధికి ప్రభుత్వం చేస్తున్న కృషి, తదితర అంశాలపై నేరుగా ప్రజలతో మాట్లాడి వివరాలు నమోదు చేసుకున్నారు. అనంతరం గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు పీతాన వెంకటరమణ, బెందాళం రమేష్, లోళ్ల శ్రీను, కొర్రాయి వాసు, బాసుదేవ్ రౌలో, బెందాళం విజయ్, పుల్లట రాజు, బెందాళం తిరుమల, సత్య, తదితరులు పాల్గొన్నారు.

ఇచ్ఛాపురం: మున్సిపాలిటీలోని 15వ వార్డులో ఇదేం ఖర్మ రాష్ట్ర ప్రభుత్వానికి కార్యక్రమంలో భాగంగా ఇంటింటికీ కరపత్రాలు పంపిణీ చేశారు. రాష్ట్ర ప్రభుత్వ విధానాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు కాళ్ల ధర్మారావు, సాలీనా డిల్లీ, నందిక జాని, నందిగాం కోటేశ్వరరావు, కాళ్ల జయదేవ్, కొండా శంకరరెడ్డి, నాగరాజు పాత్రో, జానకిరావు, సంతోష్, పాల్గొన్నారు.

పలాస : మున్సిపాలిటీలోని 13, 21 వ వార్డులో టిడిపి నేతలు ఇదేం ఖర్మ మన రాష్ట్రానికి అనే కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రతి ఇంటికి వెళ్లి ప్రభుత్వ వైఫల్యాలను అసమర్ధతను ప్రజలకు వివరిస్తూ వారి సమస్యలను లిఖితపూర్వకంగా నమోదు చేశారు.


మెళియాపుట్టి : మాట్లాడుతున్న సాగర్


కవిటి : ర్యాలీ నిర్వహిస్తున్న టిడిపి నాయకులు

కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర బిసిసెల్ ప్రధాన కార్యదర్శి లొడగల కామేశ్వరరావు, కౌన్సిలర్ గురిటి సూర్యనారాయణ, టంకాల రవిశంకర్ గుప్తా, గాలి కృష్ణారావు, బడ్డ నాగరాజు, చంద్రరావు, దొక్కరి శంకర్, సవర రాంబాబు, పాల్గొన్నారు.

మెళియాపుట్టి : మండలంలోని ముక్కాపురంలో నిర్వహించిన ఇదేం ఖర్మ మన రాష్ట్రానికి కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర కార్యదర్శి కలమట సాగర్ పాల్గొని ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ వైఫల్యాలను వివరించారు. కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షులు భాస్కర్‌గౌడ్, జిల్లా మహిళా ఉపాధ్యక్షులు బూర్ల లలితకుమారి, సంతలక్ష్మీపురం సర్పంచ్ బమ్మిడి భాస్కరరావు, ఉర్లాన వసంత్, హనుమంతు చంద్రశేఖర్, విష్ణు పండ పాల్గొన్నారు.

జెడి దృష్టికి సచివాలయ ఉద్యోగుల సమస్యలు

ప్రజాశక్తి- ఆమదాలవలస

గ్రామ, వార్డు సచివాలయాల్లో రెండో నోటిఫికేషన్ ద్వారా ఎంపికై విధులు నిర్వహిస్తున్న ఉద్యోగుల ఆంటీసిడెంట్ వెరిఫికేషన్ ప్రక్రియను పూర్తి చేసి త్వరితగతిన రెగ్యులర్ చేయాలని సచివాలయ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు షేక్ అబ్దుల్ రజాక్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కూన వెంకట సత్యనారాయణ కోరారు. ఈ మేరకు విజయవాడలోని గ్రామ, వార్డు సచివాలయశాఖ జాయింట్ డైరెక్టర్ వికాస్ మర్మట్‌ను గురువారం కలిసి వినతిపత్రం అందజేశారు. అలాగే సచివాలయాల్లో పనిచేస్తున్న ఎక్స్ సర్వీస్‌మెన్ ఉద్యోగులకు పే ప్రొటెక్షన్ కల్పించాలన్నారు. బదిలీలకు సచివాలయ ఉద్యోగులు ఎదురు చూస్తున్నారని, త్వరితగతిన బదిలీలకు ఆదేశాలు జారీ చేయాలని కోరారు. రెండో నోటిఫికేషన్ ద్వారా విధులు నిర్వహిస్తున్న పంచాయతీ కార్యదర్శులు గ్రేడ్-5, విఆర్‌ఒ గ్రేడ్-2లకు కంప్యూటర్ ప్రొఫెషియన్సీ పరీక్ష (సిపిటి) నిర్వహించేలా ఎపిపిఎస్‌సి ఆదేశాలు జారీ



వినతిపత్రం అందజేస్తున్న సచివాలయ ఉద్యోగులు

చేయాలని అన్నారు. వార్డు పారిశుధ్య, పర్యావరణ కార్యదర్శులకు పూర్తిస్థాయిలో యూజర్ ఛార్జీల నుంచి మినహాయింపు ఇవ్వాలన్నారు. విశాఖపట్నంలో మృతి చెందిన చంద్రమోహన్ కుటుంబానికి న్యాయం కోరారు. జాయింట్ డైరెక్టర్ సమస్యలపై సానుకూలంగా స్పందించారని వారు తెలిపారు. కార్యక్రమంలో ఎపి గ్రామ, వార్డు సచివాలయ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం నాయకులు పర్ష మధు, టాటా మణికంఠ, నవీన్, గోపీచంద్, మురళి, కృష్ణ పాల్గొన్నారు.

సత్తా చాటిన ఎపి మోడల్ స్కూల్

ప్రజాశక్తి- పోలాకి

పిరియాగ్రహారం హైస్కూల్‌లో ఇటీవల నిర్వహించిన మండల స్థాయి సైన్స్ ఎగ్జిబిషన్‌లో ఈదులవలస ఎపి మోడల్ స్కూల్ విద్యార్థులకు ప్రథమ స్థానం సాధించినట్లు ప్రిన్సిపాల్ పైడి ప్రవీణ తెలిపారు. గురువారం పాఠశాలలో గెలుపొందిన విద్యార్థుల పి. యుగంధర్, ఎం.పవన్‌కుమార్‌కు అభినందనలు తెలిపారు. జనవరిలో జరిగే జిల్లా స్థాయి లెవెల్ పోటీల్లో విజయం సాధించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు. తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న ప్రిన్సిపాల్ ప్రవీణ


బాలుడిని అప్పగిస్తున్న ఎస్ఐ బాలరాజు

తల్లిదండ్రుల చెంతకు బాలుడు

ప్రజాశక్తి- సోంపేట

మండల కేంద్రంలోని గాంధీనగర్-2వ వీధికి ఓ విద్యార్థి బుధవారం అదృశ్యమయ్యారు. వెంటనే తల్లిదండ్రులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఎస్ఐ బాలరాజు కేసు దర్యాప్తు చేసి విద్యార్థి ఆచూకీ కనుగొని గురువారం తల్లిదండ్రులకు అప్పగించారు. వివరాల్లోకి వెళ్తే... తెప్పల తారకేశ్వరరావు స్థానిక మంగలవీధిలోకి ప్రయివేటుకు అని వెళ్లాడు. రాత్రయినా ఇంటికి రాకపోవడంతో తల్లిదండ్రులు ఆందోళన చెందిందారు. కంగారుపడిన తల్లిదండ్రులు చుట్టుపక్కల, బంధువులు, స్నేహితుల ఇళ్లల్లో వెతికారు. ఎక్కడా కానరాకపోవడంతో వెంటనే సోంపేట పోలీసులకు బాలుడు తల్లి హేమలత ఫిర్యాదు చేశారు. పోలీసులు సిసి ఫుటేజ్‌ను పరిశీలించారు. బాలుడు సైకిల్‌పై పలాస మండలం బ్రాహ్మణతర్లాలో నిర్వహిస్తున్న క్రీడా పోటీలను తలకించినట్లు నమోదైంది. సాయంత్రం ఇంటికి వెళ్తే... తల్లిదండ్రులు మందలిస్తారని భావించి సైకిల్‌ను తన స్నేహితుడికి అప్పగించి విశాఖపట్నం వెళ్లియినట్లు గుర్తించారు. అనంతరం విశాఖ వెళ్లి బాలుడిని తీసుకొచ్చి తల్లిదండ్రులకు అప్పగించడంతో కథ సుఖాంతమైంది.

వ్యక్తికి గాయాలు

కోటబొమ్మాళి: మండలంలోని పెద్దబమ్మిడి గ్రామం వద్ద బుధవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో సంతబొమ్మాళి మండలం చెట్లతాండ్రకు చెందిన పిసినికి అప్పారావు తీవ్రంగా గాయపడ్డాడు. నరసన్నపేట నుంచి వస్తునన అప్పారావు పెద్దబమ్మిడి వద్ద రోడ్డు దాటుతుండగా గుర్తుతెలియని వాహనం ఢీకొంది. ఈ ప్రమాదంలో అప్పారావు కుడికాలు నుజ్జునుజ్జు అయ్యింది. తలకు బలమైన గాయమైంది. 108లో శ్రీకాకుళం రిమ్స్‌కు తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం అక్కడ నుంచి విశాఖ కెజిహెచ్‌కు తరలిం చారు. ఎస్ఐ షేక్ ఖాదర్‌భాషా కేసు దర్యాప్తు చేస్తున్నారు.


వేలంపాట నిర్వహించనున్న ద్విచక్ర వాహనాలు

నేడు ద్విచక్ర వాహనాల వేలం

సోంపేట: సోంపేట ఎస్ఇబి వద్ద శుక్రవారం ద్విచక్ర వాహనాల వేలం నిర్వహించనున్నట్లు కార్యాలయ అధికారి టి వెంకటప్పలనాయుడు తెలిపారు. ఈ మేరకు గురువారం ఓ ప్రకటన విడుదల చేశారు. వివిధ కేసుల్లో సీజ్ చేసిన 20 ద్విచక్ర వాహనాలను వేలం వెయ్యనున్నామని తెలిపారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఈ వేలం పాట నిర్వహించనున్నట్లు తెలిపారు. ఆసక్తి ఉన్నవారు వెయ్యి రూపాయల ధరావత్ చెల్లించి, తమ ఆధార్ కార్డు పట్టుకొని రావడం ద్వారా వేలంపాటలో పాల్గొన్న వచ్చాని తెలిపారు.

500 మందికి అన్నదానం

పలాస: పట్టణంలోని శారదానగర్‌లో శారదా మాత 170వ జయంతి సందర్భంగా 500 మందికి గురువారం అన్నదానం నిర్వహించారు. తొలుత ప్రత్యేక పూజలు, తిరువీధి ఉత్సవం, భజన కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో సంఘం అధ్యక్షులు పి.మాధవరావు, సెక్రటరీ సింహాద్రి, మల్లేశ్వరరావు, ఇచ్ఛాపురం కృష్ణ, సోమేష్, రమేష్, సింహాద్రి, ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న తులసీవరప్రసాదరావు

భూ సర్వేలో తప్పులను సరిచేయాలి

కొత్తూరు: సమగ్ర భూ సర్వేలో రైతులు పేర్ల తప్పులు పడుతున్నాయని, వాటిని సరిచేయాలని వైస్ ఎంపిపి లోతుగెడ్డ తులసీవరప్రసాదరావు అధికారులకు కోరారు. మండలంలోని కురిగాం సచివాలయంలో సిబ్బందితో గురువారం సమీక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆయుష్మానుభవ పథకాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకునేలా అవగాహన కల్పించాలన్నారు. అలాగే సచివాలయ సిబ్బంది పనితీరు మెరుగుపర్చుకోవాలన్నారు. ప్రజలకు అందుబాటులో నిరంతరం ఉండాలన్నారు. పని వేళలు తప్పక పాటించాలన్నారు. సమావేశంలో ఇన్‌ఛార్జి ఎంపిడిఒ కె.కృష్ణారావు, సర్పంచ్ అశోక్‌కుమార్ పాల్గొన్నారు.


పతకాలు సాధించిన విద్యార్థులు

బోరుభద్ర విద్యార్థుల సత్తా

సంతబొమ్మాళి: కోనసీమ చిత్రకళా పరిషత్, అమలాపురంలో నిర్వహించిన రాష్ట్రస్థాయి చిత్రకళా పోటీల్లో మండలంలోని బోరుభద్ర జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు ఎనిమిది బంగారు, రెండు వెండి పతకాలు సాధించి సత్తా చాటారని ప్రధానోపాధ్యాయులు టి.వి.రమణ మూర్తి, డ్రాయింగ్ ఉపాధ్యాయులు ఎ.శంకరరావు గురువారం తెలిపారు. కె.విజయేంద్ర, ఎల్.భానుప్రసాద్, ఎల్.యుగంధర్, కె.గాయత్రి, యు.చందు, సిహెచ్.స్వరూప, బి.గణేష్, కె. సాయికుమార్‌లు బంగారం, ఎం.రీతికా, టి. సాయిలు వెండి పతకాలు సాధించారని పేర్కొన్నారు. రాష్ట్రస్థాయిలో ప్రతిభ చూపడానికి అత్యుత్తమ శిక్షణ ఇచ్చిన డ్రాయింగ్ ఉపాధ్యాయులు ఎ.శంకరరావును హెచ్‌ఎం, ఉపాధ్యాయులు అభినందించారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం మాట్లాడుతూ రాష్ట్రస్థాయిలో పాఠశాలకు అరుదైన గౌరవం తీసుకొచ్చారన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పి.తిరుపతిరావు, టి.లోకేశ్వర రావు, డి.ఉమాశంకర్, బి.తాతారావు, ఎ.వెంకటరెడ్డి, లక్ష్మణరావు, శాంతారావు, కృష్ణారావు, కె.త్రినాథరావు, ఎర్రయ్య, పి.అప్పలరాజు, కె.తవిటరెడ్డి, కె.రమణమ్మ, డి.ఉమాదేవి, టి.విజయలక్ష్మి, బి.నాగమణి పాల్గొన్నారు.

గౌతు శిరీష పరామర్శ

ప్రజాశక్తి- పలాస


మండలంలోని టెక్కలి పట్నంలో తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు కొల్లి అప్పారావు తల్లి, గోదావరిపురం గ్రామంలో తెలుగుదేశం పార్టీ కుటుంబసభ్యులు పల్లి దాలయ్య, కాశీ పాల్గుణమ్మ, చిన్న నీలావతి గ్రామానికి చెందిన పుచ్చ భాస్కరరావు తల్లి ఇటీవల మృతి చెందారు. ఆయా కుటుంబాలను టిడిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గౌతు శిరీష గురువారం పరామర్శించారు. ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఆమెతోపాటు టిడిపి పలాస మండల అధ్యక్ష, కార్యదర్శి కుత్తుమ్ లక్ష్మణ


పరామర్శించిన గౌతు శిరీష

కుమార్, దువ్వాడ సంతోష్, తెలుగు యువత మండల అధ్యక్షుడు కిక్కర ఢిల్లీరావు, మాజీ ఎంపిటిసి బత్తిన రూపావతి, వ్యవసాయ అనుబంధం సభ్యులు అవుగాన షణ్ముఖరావు, అవుగాన దశరథ, సీనియర్ నాయకులు సవర సోమేశ్, మున్నా గౌడ్, హరియాపల్లి ప్రభుదాసు, పురుషోత్తం, కుమార్ రాజు, జోగారావు, ఆనంద్, సోమేశ్వరరావు తదితరులు ఉన్నారు.

నూతన వంగడాలతో అధిక దిగుబడులు

ఏరువాక శాస్త్రవేత్తలు వెంకటరావు, చిట్టిబాబు




అవగాహన కల్పిస్తున్న చిట్టిబాబు, వెంకటరావు

వజ్రపుకొత్తూరు: వరిలో అధిక దిగుబడులకు నూతన రకాలు ఎంపిక చేసుకోవడం అవసరమని ఏరువాక కేంద్రం శాస్త్రవేత్తలు డాక్టర్ చిట్టిబాబు, డాక్టర్ పైడి వెంకటరావు అన్నారు. గురువారం పొల్లాడలో ఏరువాక కేంద్రం ఆధ్వర్యంలో క్షేత్ర దినోత్సవం నిర్వహించారు. ఎంటియు 1282, ఎంసిఎం 125 మరియు, ఆర్‌జిఎల్ 7016 వాటిని పరిశీలించి ఈ విత్తనాలు దిగుబడి సామర్థ్యంను రైతులకు వివరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విత్తనం ఎంపికలో రైతులు తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. అధిక దిగుబడులు సాధన ఎంపిక చేసిన రకాలతోనే ఉంటుందన్నారు. స్థానిక వ్యవసాయాధికారుల సూచనలు పాటించాలన్నారు. రసాయన ఎరువుల వినియోగం తగ్గించుకొని జీవామృతం ఎరువులను వినియోగించాలని సూచించారు. జీవామృతం ఎరువులను వినియోగం ద్వారా భూసార స్థిరీకరణ జరుగుతుందన్నారు. వంశధార నీరు శివారు భూములకు సకాలంలో అందకపోవడం వల్ల దిగుబడులపై ప్రభావం చూపిందని, గత మూడేళ్లుగా వంశధార నీరు అందడం లేదని రైతులు తెలిపారు. ఎఒ కిరణ్‌వాణి, సర్పంచ్ అట్టాడ గోపి, మార్పు రవికుమార్, అట్టాడ సూర్యనారాయణ, ఈశ్వరరావు పాల్గొన్నారు.

రైతులతో మమేకం కావాలి

ప్రజాశక్తి- కవిటి

పిఎసిఎస్ అధ్యక్షులు, సభ్యులు, ఎఎబి అధ్యక్షులు మండలంలోని రైతులతో మమేకమై, రైతులకు ప్రభుత్వానికి మధ్య వారధిలా పని చేయాలని ఎంపిపి ప్రతినిధి కడియాల ప్రకాష్ అన్నారు. నూతనంగా నియమించబడ్డ పిఎసిఎస్ ఛైర్మన్ దేవరాజ్ సాహు, సభ్యులు కాయ భీమసేన్, ఎన్ని అశోక్, ఎఎబి ఛైర్మన్ దువ్వు కృష్ణారెడ్డిలను గురువారం స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా కడియాల ప్రకాష్ మాట్లాడుతూ అధిష్ఠానం నమ్మకంతో అప్పగించిన బాధ్యతలను సక్రమంగా నిర్వహించాలని సూచించారు. ప్రస్తుతం కోతల సీజన్ కావడంతో మిల్లర్లు, రైతులను సమన్వయం చేసుకుంటూ మండలంలో చివరి గింజ వరకు కొనుగోలు


దేవరాజ్ సాహును సన్మానిస్తున్న ప్రకాష్, తదితరులు

జరిగేలా పర్యవేక్షించాలని అన్నారు. పిఎసిఎస్ ద్వారా శతశాతం పంట రుణాలు మంజూరు చేయాలని సూచించారు. కార్యక్రమంలో వైస్ ఎంపిపి పూడి నేతాజీ, ఎఎంసి మాజీ వైస్ ఛైర్మన్ రజనీకుమార్ దొలై, కో-ఆప్షన్ మెంబర్ పాండవ శేఖర్, సర్పంచుల సంఘం అధ్యక్షుడు పూడి లక్ష్మణరావు, కార్పొరేషన్ ఛైర్మన్ కృష్ణారెడ్డి, యలమంచి నీలయ్య, తదితరులు పాల్గొన్నారు.


నిరసన తెలుపుతున్న కళింగ వైశ్య సంఘం నాయకులు

కావ్యకు న్యాయం చేయాలని నిరసన

ప్రజాశక్తి- పలాస

దుబాయ్‌లో భర్త వేధింపులకు గురవుతున్న కావ్య, ఆమె కుమార్తె, తల్లిదండ్రులను పలాసకు రప్పించాలని కోరుతూ కళింగ వైశ్య సంఘం ఆధ్వర్యాన నాయకులు నిరసన తెలిపారు. సోషల్ మీడియాలో ఆమె వీడియో వైరల్ కావడంతో కావ్యకు న్యాయం చేసేలా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు స్పందించాలని నాయకులు కోరారు. పలాస కన్యకాపరమేశ్వరి కళింగ కోమటి సంఘం నాయకులు మల్లా కృష్ణారావు మాట్లాడుతూ డోకి సతీష్, జానకి కుమార్తె కావ్యను పార్వతీపురానికి చెందిన శంఖ మల్లిఖార్జునరావు కుమారుడు అవినాష్‌కు నాలుగేళ్ల క్రితం వివాహమైందని చెప్పారు. వివాహ సమయంలో 40 తులాల బంగారం, మూడు కేజీల వెండి ఇచ్చినప్పటికీ, అక్కడితో సంతృప్తి చెందక తరుచు అత్తమామలతో కలిసి నిత్యం అదనపు కట్నం కోసం, ఇల్లు కొనివ్వాలంటూ వేధిస్తుండేవారని అన్నారు. వేధింపులు తట్టుకోలేక కావ్య ఏడాది కిందట పలాసలోని తల్లిదండ్రుల వద్దకు వచ్చేసిందన్నారు. పెద్ద మనుషులు జోక్యంతో కావ్య భర్త అవినాష్ సంప్రదింపులు చేసి భవిష్యత్‌లో ఇటువంటి వేధింపులకు గురిచేయనని, గురిచేస్తే సివిల్, క్రిమినల్ చర్యలకు బాధ్యుడునని పెద్దమనుషుల సమక్షంలో లిఖితపూర్వకంగా అవినాష్ హామీ ఇచ్చి తన వెంట భార్యను తీసుకెళ్లాడని అన్నారు. కొన్ని రోజులు పార్వతీపురంలో ఉండి, ఉద్యోగ రీత్యా దుబాయ్‌లో స్థిరపడ్డారని చెప్పారు. అక్కడ కావ్యను వేధించ సాగాడని, ఈ విషయం తెలుసుకున్న కావ్య తల్లిదండ్రులు తమ కుమార్తెను తేవడానికి వెళ్తే వారిపై ట్రావెల్ బ్యాన్ కేసు నమోదు చేశారని వాపోయారు. వారిని దేశానికి రప్పించి, నిందితునిపై చర్యలు తీసుకోవాలని వారు కోరారు. ఈ సందర్భంగా పోలీసులకు ఫిర్యాదు చేశారు. నిరసన ర్యాలీలో పలాస మార్కెట్ కమిటీ ఛైర్మన్ పివి సతీష్, వైశ్య సంఘ పూర్వ అధ్యక్షులు మల్లా భాస్కరరావు, పరిశ్రమకు వాడ జీడి ఉత్పత్తిదారుల సంఘం అధ్యక్షులు మల్ల రామేశ్వరం, తాళసు రామారావు, వైశ్య సంఘ మహిళలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

రూ.91 లక్షలకు అరసవల్లి తలనీలాల వేలం

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

అరసవల్లి సూర్యనారాయణస్వామి ఆలయ ప్రాంగణంలోని అనివేటి మండపంలో ఏడాది పాటు తలనీలాలు టెండరు బహిరంగ వేలం పాట గురువారం నిర్వహించారు. అరసవల్లి ఆలయ ఇఒ వి.హరిసూర్యప్రకాష్ అధ్యక్షతన శ్రీకూర్మం ఆలయ ఇఒ జి.గురునాథం, ఆలయ ప్రధాన అర్చకులు ఇప్పిలి శంకరశర్మల పర్యవేక్షనలో వేలం నిర్వహించారు. ఈ పాటలో నలుగురు పాటదారులు పాల్గొని పోటీపడ్డారు. గతేడాది వేలం దక్కించుకున్న జైఎంటర్ ప్రైజెస్ యాజమాన్యం గతేడాది కంటే కేవలం రూ.లక్ష హెచ్చు పాట ద్వారా దక్కించుకున్నారు.


వేలం నిర్వహిస్తున్న అరసవల్లి అధికారులు

నిబంధనలను అనుసరించి కేవలం రూ.లక్ష హెచ్చుపాటదారులకు టెండరు ఖరారు చేయాల్సి ఉందని ఇఒ తెలిపారు. వేలం నిర్వహణలో ఆలయ సూపరింటెండెంట్ కె.వెంకటేశ్వరరావు, బి.ఎస్.చక్రవర్తి, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

జీతం చెల్లించాలని నిరసన




నిరసన తెలుపుతున్న కార్మికులు

టెక్కలి రూరల్: పట్టణంలోని ఎర్రన్నాయుడు మంచినీటి పథకంలో పని చేస్తున్న తమకు తొమ్మిది నెలలుగా జీతాలు ఇవ్వడం లేదని, ఇలాగైతే కుటుంబాలను ఎలా పోషించగలమని కార్మికులు ప్రశ్నిస్తున్నారు. బకాయి వేతనాలు చెల్లించాలని కోరుతూ ఆర్‌డబ్ల్యుఎస్ డిఇ కార్యాలయం వద్ద గురువారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా కార్మికులు అనిల్‌కుమార్, సురేష్ మాట్లాడుతూ పట్టణంలోని 24 గ్రామాలకు రక్షిత మంచినీటి పథకం ద్వారా నీరు సరఫరా చేస్తున్నామని తెలిపారు. 12 మందికి తొమ్మిది నెలలుగా జీతాలు అందడం లేదని వాపోయారు. రాత్రి, పగలు తేడా లేకుండా పని చేస్తుంటే కాంట్రాక్టరుకు బిల్లులు కావడం లేదని ఐదు నెలలుగా చెప్తున్నారని తెలిపారు. ఈ విషయమై ఇంజినీరింగ్ అధికారులకు, సబ్ కలెక్టర్‌కు, ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్ దృష్టికి తీసుకొచ్చామని స్పష్టం చేశారు. తమకు బకాయి జీతాలు చెల్లించకుంటే సమ్మెకు వెళ్తామని హెచ్చరించారు. అనంతరం సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని డిఇకి అందించారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో ధర్మారావు, ధనుంజయ్, శ్రీను, ఉమేష్, రత్నాకర్, సంతోష్, రమేష్, పాపారావు, సిఐటియు నాయకులు ఎన్.షణ్ముఖరావు పాల్గొన్నారు.

పింఛన్ల బకాయిలు అందజేత

పొందూరు: మండలంలోని పిల్లలవలసలో రాజకీయ కక్షసాధింపులో భాగంగా నిలిపివేసిన 9 మంది టిడిపి సానుభూతిపరుల పింఛనుదారుల బకాయి పింఛన్ల చెక్కులను హైకోర్టు ఆదేశాలతో సర్పంచ్ బుడుమూరు పోలినాయుడు సమక్షంలో అధికారులు అందజేశారు. గత పంచాయతీ ఎన్నికల్లో వైసిపి బలపర్చిన సర్పంచ్ అభ్యర్థికి ఓటు వేయలేదనే సాకుతో వీరి పింఛన్లు అధికార పార్టీ నాయకులు ఒత్తిడితో నిలిపివేశారని సర్పంచ్ తెలిపారు. దీనిపై జిల్లా అధికారులకు పలుమార్లు ఫిర్యాదు చేసినా ఫలితం లేకపోవడంతో టిడిపి జిల్లా అధ్యక్షులు కూన రవికుమార్ సహకారంతో హైకోర్టును ఆశ్రయించినట్లు పేర్కొన్నారు. దీనిపై విచారణ జరిపిన న్యాయస్థానం తక్షణమే లబ్ధిదారులకు పింఛన్లను పునరుద్ధరించాలని


చెక్కులను చూపుతున్న పింఛనుదారులు

ఆదేశించడంతో న్యాయం జరిగిందన్నారు. అలాగే పింఛన్లు నిలిపివేసిన సమయంలోని బకాయిలను చెల్లించాలని స్పందనలో బాధితులు ఫిర్యాదు చేయడంతో అధికారులు బకాయి చెక్కులను అందజేసినట్లు తెలిపారు. దీంతో అర్హులైన పింఛనుదారులకు న్యాయం జరగడంపై సర్పంచ్, ఉపసర్పంచ్, వార్డు సభ్యులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

రోడ్డు కోసం ఉపవాస దీక్ష

వజ్రపుకొత్తూరు: అమరజీవి పొట్టి శ్రీరాములు స్ఫూర్తితో గుల్లలపాడు-శారదాపురం రోడ్డు కోసం ఉపవాస దీక్ష చేయడానికి సిద్ధమని గుల్లలపాడు వాసులు ప్రతినబూనారు. గుల్లలపాడు కాలనీలో పొట్టి శ్రీరాములు వర్ధంతిని దువ్వాడ రామారావు ఆధ్వర్యంలో గురువారం రాత్రి నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. గుల్లలపాడు రోడ్డు నిర్మాణం కోసం ఆర్భాటంగా శంకుస్థాపన చేసిన ప్రభుత్వం రోడ్డు సంగతి మరిచారని వాపోయారు. రోడ్డు నిర్మాణంలో భాగంగా రాళ్లు పరిచి అలాగే విడిచి పెట్టారని పశువులు, మనుషులు నడవడానికి సైతం ఇబ్బందులు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. రోడ్డు నిర్మాణం పూర్తి చేసి ప్రభుత్వం తన చిత్తశుద్ధి నిరూపించుకోవాలని, లేదంటే ఆమరణ దీక్షకు సిద్ధమని తెలిపారు.


మాట్లాడుతున్న సాయిరాజ్

తులసిగాం సిఎఫ్ తొలగింపు

ఇచ్ఛాపురం: మండలంలోని తులసిగాం పంచాయతీ సిఎఫ్ రాజేశ్వరి అక్రమాలపై డ్వాక్రా మహిళలు ఆందోళన చేస్తున్న నేపథ్యంలో ఆమెను తొలగించినట్లు వైసిపి ఇచ్ఛాపురం నియోకవర్గ ఇన్‌ఛార్జి పిరియా సాయిరాజ్ అన్నారు. గ్రామ పంచాయతీలో వెలుగు ఎపిఎం ప్రసాదరావు అధ్యర్యంలో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. మూడు నెలలుగా వివాదం నెలకొనడంతో జెడ్‌పి ఛైర్‌పర్సన్, సాయిరాజ్ ప్రత్యేక చొరవ తీసుకున్నారు. ఈ సందర్భంగా సాయిరాజ్ మాట్లాడుతూ గ్రామస్తులు ఇకనుండి జాగ్రత్తగా సమిష్టి నిర్ణయాలు తీసుకునే గ్రామ పంచాయతీ అభివృద్ధికి బాటలు వేయాలన్నారు. జెడ్‌పి ఛైర్‌పర్సన్ విజయ మాట్లాడుతూ వైసిపి ప్రభుత్వం మహిళలకు పెద్దపీట వేస్తోందన్నారు. అనంతరం మహిళా సమాఖ్య భవనాన్ని ప్రారంభించారు. నాయకులు కె.మోహన్‌రావు, ఉప్పాడ రాజారెడ్డి, తులసీరామ్, ధర్మరాజు, యాదవరెడ్డి, రుక్మాంగధరరెడ్డి, చిట్టిబాబు పాల్గొన్నారు.

పారిశుధ్యంపై అవగాహన

ఇచ్ఛాపురం: మున్సిపాలిటీలోని 22వ వార్డులోని నాలుగు వీధుల్లో పారిశుధ్యంపై ప్రజలకు కౌన్సిలర్ కాళ్ల దిలీప్‌కుమార్ అవగాహన కల్పించారు. క్లీన్ ఆంధ్రప్రదేశ్ వారోత్సవాల్లో భాగంగా గురువారం వార్డులో విస్తృతంగా పర్యటించారు. మహిళలకు తడి, పొడి చెత్త వేరు చేయడంపై అవగాహన కల్పించారు.


ధాన్యపు నిల్వలను పరిశీలిస్తున్న సబ్ కలెక్టర్ రాహుల్ కుమార్‌రెడ్డి

ప్రతి రైతుకూ న్యాయం చేస్తా

సబ్ కలెక్టర్ రాహుల్ కుమార్ రెడ్డి

మెళియాపుట్టి: ప్రతి రైతుకూ న్యాయం చేస్తామని టెక్కలి సబ్ కలెక్టర్ రాహుల్ కుమార్‌రెడ్డి అన్నారు. మండలంలో దీనబంధుపురం, జలక లింగపురం గ్రామాల్లో గురువారం ఆకస్మికంగా సందర్శించారు. రైతుల కళ్లంలో నిల్వ ఉంచిన ధాన్యాన్ని పరిశీలించారు. రైతులతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కౌలుకు తీసుకొని సాగుచేస్తున్న రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను ఆయన దృష్టికి తీసుకువచ్చారు. పొలానికి సంబంధించి దస్త్రాలు లేనందున ధాన్యాన్ని ప్రభుత్వానికి అమ్మకం చేపట్టడానికి సమస్యలు తలెత్తుతున్నాయని ఆయన దృష్టికి రైతులు తీసుకొచ్చారు. ఇటువంటి సమస్యలు పరిష్కారానికి తగు చర్యలు తీసుకోవాలని రెవిన్యూ సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో తహశీల్దార్ పి.సరోజిని, ఎఒ దానకర్ణుడు పిఎసిఎస్ అధ్యక్షులు ఉర్లన బాలరాజు, ఆర్ఐ అన్నాజిరావు, రెవెన్యూ సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.


ఎస్ఐకు జ్ఞాపికను అందజేస్తున్న విద్యార్థులు

వేగం కాదు... గమ్యం ముఖ్యం

ట్రాఫిక్ ఎస్ఐ లక్ష్మణరావు

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

ప్రతిఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటించి సురక్షితంగా గమ్యస్థానానికి చేరుకోవాలని ట్రాఫిక్ ఎస్ఐ ఎన్.లక్ష్మణరావు పిలుపునిచ్చారు. నగరంలోని మహాలక్ష్మినగర్‌లో ఉన్న చైతన్య విద్యాసంస్థలు నిర్వహించే స్మార్ట్ లివింగ్ ప్రోగ్రాంలో ట్రాఫిక్ నిబంధనలపై గురువారం అవగాహనా సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వేగం కాదు... గమ్యం ముఖ్యమని అన్నారు. చిన్నతనం నుంచి సామాజిక బాధ్యత అలవర్చుకోవాలన్నారు. మీ జీవితం మీ చేతిలో ఉందని, నిబంధనలు పాటించకపోతే ప్రమాదాలు సంభవిస్తాయని అన్నారు. సెల్‌ఫోన్‌లో మాట్లాడుతూ వాహనాలను నడపటం అత్యంత ప్రమాదమన్నారు. ప్రిన్సిపాల్ ఆర్.రాంప్రసాద్ మాట్లాడుతూ వాహనం నడిపే సమయంలో హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలన్నారు. సెల్‌ఫోన్ మాట్లాడుతూ డ్రైవింగ్ చేయవద్దని విద్యార్థులకు సూచించారు. కార్యక్రమంలో శ్రీచైతన్య విద్యాసంస్థల ఉత్తరాంధ్ర జిల్లాల కో-ఆర్డినేటర్ ఎ.బాలరాజు, రీజనల్ ఇన్‌ఛార్జి ఎస్.రామినాయుడు, జోనల్ అకాడమిక్ డీన్ పి.మోహన్‌బాబు, అకాడమిక్ డీన్ ఎ.హరిప్రసాద్, వైస్ ప్రిన్సిపాల్ ఇంద్రమౌళి, ఐకాన్ ఇన్‌ఛార్జి బి.జనార్థన్ పాల్గొన్నారు.

చిరస్మరణీయుడు పొట్టి శ్రీరాములు


శ్రీకాకుళం అర్బన్ : చిత్రపటం వద్ద నివాళ్లర్పిస్తున్న లక్ష్మీదేవి

కవిటి: అమరజీవి పొట్టి శ్రీరాములు చిరస్మరణీయుడని ఎంపిపి ప్రతినిధి కడియాల ప్రకాష్ అన్నారు. స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో శ్రీరాములు వర్ధంతి సందర్భంగా చిత్రపటానికి పూలమాలేసి, నివాళు లర్పించారు. కార్యక్రమంలో వైస్ ఎంపిపి పూడి నేతాజీ, కో-ఆప్షన్ మెంబర్ పాండవ శేఖర్, ఎఎంసి మాజీ వైస్ చైర్మన్ రజనీకుమార్ దొలై, ఎఎబి చైర్మన్ దువ్వు కృష్ణారెడ్డి, పిఎసిఎస్ అధ్యక్షులు దేవరాజ్ సాహు, సభ్యులు కాయ భీమసేన్, ఎన్ని అశోక్, యలమంచి నీలయ్య, ఎంపిడిఒ పైలా సూర్యనారాయణరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

పలాస: రాష్ట్ర సాధనకు పొట్టి శ్రీరాములు త్యాగం మరువలేనిదని టిడిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గౌతు శిరీష అభివర్ణించారు. పలాస టిడిపి కార్యాలయంలో గురువారం పొట్టి శ్రీరాములు వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలవేసి, ఘనంగా నివాళు లర్పించారు. ఆమె మాట్లాడుతూ మహనీయుని త్యాగానికి గుర్తుగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాన్ని కాపాడుకోవడానికి ప్రతి ఒక్కరూ ముందుకు రావాలని పిలుపునిచ్చారు. రాష్ట్ర కార్యదర్శి వజ్జ బాబూరావు, బిసిసెల్ ప్రధాన కార్యదర్శి లొడగల కామేశ్వరరావు, కౌన్సిలర్ గురిటి సూర్యనారాయణ, గాలి కృష్ణారావు, బడ్డ నాగరాజు, నవీన్, హరిశంకర్, శ్రీనివాసరావు, డి.శంకర్, నరసింహులు, జోగ మల్లి, తదితరులు పాల్గొన్నారు.

నందిగాం: జయపురంలోని ప్రభుత్వ గిరిజన సంక్షేమ ఆశ్రమ ఉన్నత పాఠశాలలో అమరజీవి పొట్టి శ్రీరాయులు వర్ధంతిని గురువారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో వారి జీవిత విశేషాలను వివరించారు. హెచ్ఎం డి.శ్రీనివాసరావుతో పాటు ఉపాధ్యాయులు,


కవిటి : నివాళులర్పిస్తున్న కడియాల ప్రకాష్


పలాస : చిత్రపటం వద్ద నివాళ్లర్పిస్తున గౌతు శిరీష

విద్యార్థులు పాల్గొన్నారు.

శ్రీకాకుళం అర్బన్ : నగరంలోని టిడిపి కార్యాలయంలో పొట్టిశ్రీరాములు చిత్రపటానికి మాజీ ఎమ్మెల్యే గుండ లక్ష్మీదేవి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. కార్యక్రమంలో మాదారపు వెంకటేష్, సింతు సుధాకర్, కోరాడ హరగోపాల్, తోణంగి వెంకన్నయాదవ్, పి.ఎం.జె.బాబు, సురకాశి వెంకటరావు, ఎస్.వి.రమణ మాదిగ, రాము పాల్గొన్నారు.

శ్రీకాకుళం రూరల్ మండలం నైర వ్యవసాయ కళాశాలలో అసోషియేట్ డీన్ డాక్టర్ డి.శ్రీనివాసరావు పొట్టి శ్రీరాములు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. కార్యక్రమంలో ఆచార్య డాక్టర్ జి.మోహన్‌నాయుడు, అధ్యాపకులు డాక్టర్ చిన్నంనాయుడు, విద్యార్థులు పాల్గొన్నారు.

పట్టణాన్ని సుందరంగా తీర్చిదిద్దాలి

ప్రజాశక్తి- పలాస

పలాస-కాశీబుగ్గ పట్టణాన్ని సుందరంగా తీర్చిదిద్దాలని మున్సిపల్ చైర్మన్ బల్ల గిరిబాబు అన్నారు. పలాస మున్సిపల్ కార్యాలయంలో మహిళా మార్గదర్శి ఆధ్వర్యంలో యూనిసెఫ్, సార్డ్స్ సంస్థల సహకారంతో గురువారం ప్రజా ప్రతినిధులు, మునిసిపల్ అధికారులుకు, ప్రజా సంఘాలకు పట్టణ నీరు, పారిశుధ్యం, పరిశుభ్రత యొక్క ప్రజా ఆధారిత సేవలపై ఒక్క రోజు శిక్షణ నిర్వహించారు. ఈ సందర్భంగా చైర్మన్ గిరిబాబు మాట్లాడుతూ పలాస-కాశీబుగ్గ పట్టణాన్ని సుందరంగా తీర్చిదిద్దడానికి అందరూ సమిష్టిగా కృషి చేయాలని సూచించారు, ప్రభుత్వం ప్రతష్టాత్మకంగా ప్రవేశపెట్టిన ఇంటింటికి మంచినీటి కుళాయిని త్వరలోనే ప్రారంభిస్తామని తెలియచేశారు. మున్సిపల్ కమిషనర్ రాజగోపాల్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ప్రతి విషయాన్ని క్షుణ్ణంగా నేర్చుకుని, వారికి కేటాయించిన ప్రదేశాలలో సరియైన విధంగా పారిశుధ్య నిర్వహణకు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు, మెప్మా సోషల్ సెక్యూరిటీ విజయకుమారి, మండల విద్యా శాఖాధికారి శ్రీనివాస్, వివిధ పాఠశాలల ఉపాధ్యాయులు, అదనపు సిడిపిఒ పాపినాయుడు, సిఒ స్వప్న, మోహనరావు, రాజ్యలక్ష్మి, నీలిమ, తదితరులు పాల్గొన్నారు,.


మాట్లాడుతున్న చైర్మన్ గిరిబాబు


తిమడాంలో రికార్డులు పరిశీలిస్తున్న సిబ్బంది

రుణ బకాయిలు చెల్లించాలి

స్త్రీ నిధి మేనేజర్ శ్రీనివాసరావు

ప్రజాశక్తి- జలుమూరు

స్త్రీ నిధి ద్వారా తీసుకున్న రుణ బకాయిలు తప్పనిసరిగా చెల్లించాల్సిందే అని స్త్రీ నిధి మేనేజర్ కె.శ్రీనివాసరావు అన్నారు. గురువారం మండలంలోని తిమడాం గ్రామంలో స్త్రీ నిధి బకాయిలపై ప్రత్యేక డ్రైవ్ చేపట్టారు. తిమడాం పంచాయతీలో ఉన్న 15 సంఘాలకు 2017 నుంచి రూ.25 లక్షలు స్త్రీ నిధిలో రుణాలు ఇవ్వగా తిరిగి రూ.11 లక్షలు చెల్లింపు జరగాల్సి ఉండగా ఇందులో సుమారు రూ.మూడు లక్షల వరకు మొండి బకాయిలు ఉన్నాయన్నారు. మండలంలోని జలుమూరు, ఎలమంచిలి, సుబ్రహ్మణ్యపురం పంచాయతీల్లో కూడా బకాయిలు ఉన్నాయన్నారు. వీటి వసూళ్లకు ప్రత్యేక బృందాలను నియమించి వసూళ్ల వేగవంతం చేస్తున్నామన్నారు. ఆయనతోపాటు సిసిలు టివిరమణ, తవిటినాయుడు, సరస్వతి, విఒఎలు ఉన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న భీమశంకర్

రేపు ఎంపీ పుట్టిన రోజు

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

శ్రీకాకుళం పార్లమెంట్ సభ్యులు కింజరాపు రామ్మోహన్‌నాయుడు 35వ జన్మదిన వేడుకలు ఈ నెల 18న ఘనంగా టిడిపి కార్యకర్తలు నిర్వహించాలని మాజీ ఎమ్మెల్యే గుండ లక్ష్మీదేవి సూచించారు. నగరంలోని ఎంపీ ప్రజా సదన్‌లో వేడుకల సన్నాహక సమావేశం గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రజాదరణ గల నాయకునిగా మరిన్ని పుట్టిన రోజు వేడుకలు నిర్వహించుకోవాలన్నారు. అందులో భాగంగా జన్మదిన వేడుకల నిర్వహణ పోస్టరును ఆవిష్కరించారు. వివిధ సేవా కార్యక్రమాలతో పాటు కేక్ కట్ చేస్తామని వివరించారు. సమావేశంలో టిడిపి నాయకులు చౌదరి బాబ్జి, చిట్టి మోహన్, కొర్ను ప్రతాప్, ముద్దాడ కృష్ణమూర్తినాయుడు, అరవల రవీంద్ర, చింతు సుధాకర్, పి.ఎం.జె.బాబు, మాదారపు వెంకటేష్, గొండు శంకర్, చిట్టి నాగభూషణం, జామి భీమశంకర్, మెండ దాసునాయుడు పాల్గొన్నారు.


కెజిబివిలో పనులను పరిశీలిస్తున్న జాన్ బెనహర్

'నాడు-నేడు' పనులు వేగవంతం

ప్రజాశక్తి- జలుమూరు

మనబడి నాడు-నేడులో భాగంగా ప్రభుత్వ పాఠశాలలో చేపడుతున్న అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని ఆర్‌డబ్ల్యుఎస్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ జాన్ బెనహర్ అన్నారు. మండలం కేంద్రంలోని కెజిబివి పాఠశాల, చల్లవానిపేట, దరివాడ, పెద్దదూగాం పాఠశాలల్లో చేపడుతున్న పనులను గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నాడు-నేడు నిధులు రూ.11 కోట్లతో మండలంలోని 21 పాఠశాలల్లో అభివృద్ధి పనులు చేపడుతున్నామని తెలిపారు. ఇప్పటివరకు రూ.1.50 కోట్ల పనులు ఆన్‌లైన్ చేశామని, రూ.కోటి నిధులు చెల్లించామని చెప్పారు. ఈయనతోపాటు డిఇ పి.లలితకుమారి, ఎఇ చైతన్యకుమార్, కెజిబివి ప్రిన్సిపాల్ సిహెచ్.శారద కుమారి ఉన్నారు.


ఎమ్మెల్యేను సన్మానిస్తున్న వ్యాపారులు

ఎమ్మెల్యేకు సన్మానం

ప్రజాశక్తి- రణస్థలం

ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మండల ప్రజా పరిషత్ షాపింగ్ కాంప్లెక్స్ లీజు పునరుద్ధరణ సందర్భంగా వ్యాపారస్తులు ఎచ్చెర్ల ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్‌కు గురువారం దుశ్శాలువ కప్పి సన్మానించారు. ఈ సందర్భంగా షాపింగ్ కాంప్లెక్స్ సంఘ ప్రతినిధి కొన్ని వెంకటరావు మాట్లాడుతూ ఎమ్మెల్యేకు, ఎంపిపి ప్రతినిధి పిన్నింటి సాయికుమార్‌కు ఎంపిడిఒకు షాపింగ్ కాంప్లెక్స్‌లో అద్దెకు ఉన్న వ్యాపారస్తులు జీవితాంతం రుణపడి ఉంటామన్నారు. వ్యాపారస్తులకు రానున్న రోజుల్లో ఎటువంటి ఇబ్బంది లేకుండా 11 ఏళ్ల లీజుకి ఇచ్చి వారి మనోధైర్యం పెంచారని అభినందించారు. కార్యక్రమంలో వ్యాపారస్తులు ఇడదాసుల తిరుపతిరాజు, కరిమజ్జి నాగభూషణ్, సిరాజ్, ఈశ్వరరావు, కోరాడ శ్రీను, గురునాథ్, హరీష్, రఘు, విజయ్, ప్రసాద్, జనార్థన్, శంకర్, అసిరినాయుడు, కృష్ణ పాల్గొన్నారు.

పొందూరు తహశీల్దార్‌గా రాంబాబు

పొందూరు : మండలంలోని తహశీల్దార్‌గా ఎస్.రాంబాబు గురువారం బాధ్యతలను స్వీకరించారు. ఈయన ఆమదాలవలస మండలంలోని డిటిగా పనిచేసి ఇక్కడ ఎఫ్ఎసి తహశీల్దార్‌గా బాధ్యతలను చేపట్టారు. అలాగే ఇక్కడ తహశీల్దార్‌గా పనిచేసిన ఎస్.గణపతిరావు ఆమదాలవలసకు బదిలీపై వెళ్లారు. రాంబాబుకు రెవెన్యూ సిబ్బంది స్వాగతం పలికి అభినందనలు తెలిపారు.


పరామర్శిస్తున్న గోవిందరావు

ఎంజిఆర్ పరామర్శ

మెళియాపుట్టి: మండలంలోని పట్టుపురం గ్రామానికి చెందిన సాప గణపతి తల్లి నారాయణమ్మ, వాసు మామ ఉర్లాన అప్పారావు, పైల కూర్మారావు అత్త యశోదమ్మ, షేక్ హిమాంసుతల్లి షేక్ ప్యారీ బేబీ ఇటీవల మృతిచెందారు. విషయం తెలుసుకున్న మామిడి గోవిందరావు బాధిత కుటుంబాలను పరామర్శించారు. వారి మృతికి గల కారణాలు అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో పట్టుపురం ఎంపిటిసి ప్రతినిధి నంబాల వెంకటరావు, ధనుపురం మాజీ సర్పంచ్ మామిడి గంగాధర్, భగవాన్‌దాస్, పోతురాజు శ్రీధర్, పైల కూర్మారావు, ఎస్.తిరుపతి, రామస్వామి, పి.వాసు, గొర్ల శ్రీను, ఎంజిఆర్ యువసేన సభ్యులు పాల్గొన్నారు.

జీవామృతంతో శనగకు మేలు

సంతబొమ్మాళి: జీవామృతంతో వేరుశనగకు మేలు చేస్తుందని ప్రకృతి వ్యవసాయ ప్రతినిధి ఎస్‌డి ఎ.సింహాచలం అన్నారు. గురువారం లక్ష్మీపురం క్లస్టర్ సవరపేట యూనిట్‌కు సంబంధించి తుంగాంలో నక్క రామకుమారి, లక్ష్మీపురంలో శంఖయ్యతో వెయ్యి కేజీల జీవామృతం తయారు చేయించారు. ఘన జీవామృతం దుక్కు దున్నిన తర్వాత వేసుకొని వేరుశనగ విత్తనాలు వేసుకుంటే మొక్క ఎదుగుదల, పోషకాలు వృద్ధి చెందుతాయన్నారు. కార్యక్రమంలో ఎల్.టు.ఉష, ఐసిఆర్‌పి వేణమ్మ, రైతులు పాల్గొన్నారు.


జీవామృతం తయారు చేస్తున్న ప్రతినిధులు

సంక్షిప్త వార్తలు

రేపు జాతీయ పెన్షనర్ల దినోత్సవం

పలాస: కాశీబుగ్గ కన్యకాపరమేశ్వరి ఆలయ ప్రాంగణంలో జాతీయ పెన్షనర్ల దినోత్సవం సందర్భంగా శనివారం ఉదయం 10 గంటలకు పెన్షనర్ల సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్లు అధ్యక్షులు పైల సూర్యనారాయణ, కార్యదర్శి నెమలిపురి అప్పారావు తెలిపారు. ఎనిమిది మంది వృద్ధ పెన్షనర్లకు సన్మానం చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ హాజరు కావాలని కోరారు.

ఆమదాలవలస : ఈ నెల 17న నిర్వహించనున్న జాతీయ పెన్షనర్స్ డేను విజయవంతం చేయాలని ఆల్ పెన్షనర్స్ అండ్ విశ్రాంత పర్సన్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి బొడ్డేపల్లి జనార్ధనరావు ఒక ప్రకటనలో కోరారు. పట్టణంలోని వన్ వే కూడలి వద్దకు ఉదయం 9 గంటలకు చేరుకోవాలన్నారు. అక్కడి నుంచి ర్యాలీగా శ్రీదేవి థియేటర్ ఎదురుగా ఉన్న వాసవి సరస్వతీ కళ్యాణ మండపం వద్దకు చేరుకుని సభా కార్యక్రమం కొనసాగుతుందని తెలిపారు.

22న సుబ్బారావు వర్ధంతి సభ

పలాస: విప్లవ కవి సుబ్బారావు పాణిగ్రహి 53వ వర్ధంతి సభ ఈనెల 22న బొడ్డపాడు అమరవీరుల స్మారక మందిరం ప్రాంగణంలో నిర్వహించనున్నామని సిపిఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ జిల్లా కార్యదర్శి వంకల మాధవరావు అన్నారు. గురువారం స్మారక మందిర ప్రాంగణంలో వర్ధంతి సభ కరపత్రాలను ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ తన కలంతో ప్రజలను చైతన్యవంతం చేశారని గుర్తుచేశారు. కార్యక్రమంలో అఖిల భారత రైతు కూలీ సంఘం జిల్లా నాయకులు గోరకల బాలకృష్ణ, జుత్తు వీరాస్వామి, రాపాక మాధవరావు, తాతారావు, ప్రగతిశీల మహిళా సంఘం జిల్లా కార్యదర్శి పోతనపల్లి కుసుమ, ఈశ్వరమ్మ తదితరులు పాల్గొన్నారు.

73 మందికి నేత్ర వైద్య పరీక్షలు

పొందూరు: పొందూరు మండల కేంద్రంలోని సత్యసాయి సేవాసమితి ఆధ్వర్యాన విశాఖపట్నం శంకర ఫౌండేషన్ సౌజన్యంతో గురువారం ఉచిత మెగా నేత్ర వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పలు గ్రామాలకు చెందిన 73 మందికి నేత్ర పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులను పంపిణీ చేశారు. వీరిలో 23 మందిని ప్రత్యేకంగా కంటి ఆపరేషన్లకు ఎంపిక చేశారు. కార్యక్రమంలో శంకర్ ఫౌండేషన్ ప్రతినిధులు, సత్యసాయి సేవాసమితి సభ్యులు నానాజి, విజయసాయి, సూర్యం, సాయిరాజ్, రమేష్, జగన్, సాయిప్రశాంత్ పాల్గొన్నారు.

సీతారామచంద్ర ఆలయం సందర్శన

బూర్జ : మండలంలోని బోరగవలసలో ఉన్న సీతారామచంద్ర స్వామి ఆలయంలో నిర్వహించిన నవకుండత్మక శ్రీమధష్టాక్షరి సహిత సుదర్శన మహా యజ్ఞంలో శాసనసభ స్పీకర్ తమ్మినేని సీతారాం పాల్గొన్నారు. ముందుగా ఆలయ కమిటీ సభ్యులు స్పీకర్‌ను మేళతాళాలతో పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. కార్యక్రమంలో అవుట్ సోర్సింగ్ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్, వైసిపి మండల అధ్యక్షులు ఖండాపు గోవిందరావు, జెడ్‌పిటిసి బెజ్జిపురం రామారావు, మండల ప్రత్యేక ఆహ్వానితులు కె.నాగేశ్వరరావు, పిఎసిఎస్ అధ్యక్షులు నారాయణమూర్తి, బి.సూర్యారావు, డిసిఎంఎస్ మెంబర్ జల్లు బలరాంనాయుడు, మండల నాయకులు గుమ్మడి రాంబాబు, సర్పంచ్‌లు, ఎంపిటిసిలు పాల్గొన్నారు.

అంగన్వాడీ కేంద్రాలతో పౌష్టికాహారం

కవిటి: బడుగు బలహీనవర్గాలకు చెందిన పిల్లలు, బాలింతలకు పౌష్టికాహారం అందించాలనే లక్ష్యంతో అంగన్వాడీలు పని చేస్తున్నట్లు కవిటి సర్పంచ్ పూడి లక్ష్మణరావు తెలిపారు. మండలంలోని చిన్న ఎర్రగోవిందపుట్టుగ గ్రామంలో రూ.16లక్షలతో మంజూరైన అంగన్వాడీ భవనానికి స్థానిక ప్రజా ప్రతినిధులతో కలిసి సర్పంచ్ గురువారం శంకుస్థాపన చేశారు. ఆయన మాట్లాడుతూ బడుగు బలహీనవర్గాల అభివృద్ధే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో మండల కో-ఆప్షన్ మెంబర్ పాండవ శేఖర్, ఎంపిటిసిలు నీలాచలం, మానేక్ ప్రదాన్, ఎంపిటిసి ప్రతినిధి దుద్ది ధర్మారావు, వార్డు సభ్యులు ఎర్ర లక్ష్మి, దస్య కమల, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

సచివాలయం సందర్శన

కంచిలి: మండలంలోని తలతంపర 1, 2, పెద్ద శ్రీరాంపురం, పురుషోత్తపురం సచివాలయాలను ఎంపిడిఒ చల్లా శ్రీనివాసరెడ్డి గురువారం సందర్శించారు. అనంతరం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ పిఎం జెఎవై హెల్త్ కార్డుల మంజూరుకు సిబ్బంది దృష్టి సారించాలన్నారు. విద్యార్థులకు అవసరమైన కులధ్రువీకరణ పత్రాలు మంజూరుకు దరఖాస్తు చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ ప్రతినిధి పైల మోహన్‌రావు, సచివాలయ సిబ్బంది, వాలంటీర్లు పాల్గొన్నారు.

ఆర్థికసాయం అందజేత

పలాస: పలాస మండలం మాకన్నపల్లి గ్రామస్తులు చందాలు వేసుకొని కొన్న రెండున్నర ఎకరాల్లో క్రీడా మైదానం ఏర్పాటుచేశారు. వారికి ప్రోత్సాహంగా తెలుగు యువత మండల అధ్యక్షుడు కిక్కర ఢిల్లీరావు రూ.11 వేలు ఆర్థిక సహాయం అందజేశారు. ఢిల్లీరావు మాట్లాడుతూ మాకన్నపల్లి యువత అసాధ్యం అనుకున్న దాన్ని సుసాధ్యం చేయగల దమ్ము, ధైర్యం వారి సొంతమన్నారు. తన వంతుగా ఆర్థిక సహాయంతో పాటు నా వద్ద ఉన్న జెసిబితో క్రీడా మైదానాన్ని చదును చేస్తానని హామీ ఇచ్చారు.


ఆర్థికసాయం అందజేస్తున్న ఢిల్లీరావు

పోటీ పరీక్షలతో మేధస్సు పెరుగుతుంది

కోటబొమ్మాళి: పోటీ పరీక్షల ద్వారా విద్యార్థుల్లో మేధాశక్తి పెరుగుతుందని బ్లూమింగ్ బడ్స్ పాఠశాల ప్రిన్సిపాల్ డబ్బీరు దుర్గాప్రసాద్ అన్నారు. ఈనెల 22న గణిత దినోత్సవం, శ్రీనివాస రామానుజన్ జయంతిని పురస్కరించుకొని గురువారం ఎపి ప్రైవేటు పాఠశాలల అసోసియేషన్ ఆధ్వర్యంలో గణిత టాలెంట్ టెస్టును పాఠశాలలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇలాంటి పరీక్షలు విద్యార్థులు రాయటం వల్ల వారికి భవిష్యత్‌లో జరగబోయే పోటీ పరీక్షలకు దోహదపడుతుందని అన్నారు. కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ నెయ్యిల చంద్రరావు, ఉపాధ్యాయులు బి.రాజేష్, ఎన్.చైతన్య, రమణమ్మ, తదితరులు పాల్గొన్నారు.

టెక్కలి: శ్రీనివాస రామానుజన్ జయంతిని పురస్కరించుకొని అమ్మఒడి ఇంగ్లీష్ మీడియం స్కూల్‌లో 6 నుంచి పదో తరగతి విద్యార్థులకు గణిత టాలెంట్ టెస్ట్ నిర్వహించారు. కార్యక్రమంలో ప్రైవేటు స్కూల్ అసోసియేషన్ టెక్కలి నియోజకవర్గ అధ్యక్షులు నౌపడ సింహాచలం, బరాటం శ్రీనివాసరావు, గట్టి పాపారావు, తదితరులు పాల్గొన్నారు.

సోంపేట: పట్టణంలోని రామానుజన్ జయంతిని పురస్కరించుకొని గణిత అష్టావధానం నిర్వహించారు. అష్టావధాని తిరుపతిరావు పుచ్ఛకులు అడిగిన ప్రశ్నలకు సమాధానం చెప్పారు. ఈ సందర్భంగా ఆయనను ఉపాధ్యాయులు సత్కరించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ వివిఎస్.ప్రసాద్, ఉపాధ్యాయులు తిరుపతిరావు, శకుంతల, తదితరులు పాల్గొన్నారు.

ఇచ్ఛాపురం: ఎపి ప్రైవేటు స్కూల్ అసోసియేషన్ ఆధ్వర్యాన మండలంలోని అన్ని ప్రైవేటు పాఠశాలల్లో గణిత టాలెంట్ టెస్ట్ నిర్వహించారు. 6 నుంచి పదో తరగతి విద్యార్థులకు ఈ పరీక్షలు నిర్వహించినట్లు రాష్ట్ర కార్యదర్శి దక్కత కృష్ణమూర్తిరెడ్డి తెలిపారు. వీరికి ఈ నెల 22న బహుమతులు ప్రదానం చేస్తామన్నారు.


గణిత పరీక్షలు నిర్వహిస్తున్న ఉపాధ్యాయులు

ఒడిశా ధాన్యం రాకుండా చర్యలు


తహశీల్దార్‌కు వినతిపత్రం అందిస్తున్న నాయకులు

కంచిలి: మండలంలోకి అక్రమంగా తరలివస్తున్న ఒడిశా ధాన్యాన్ని రాకుండా చూడాలని రైతు సంఘం నాయకులు కోరారు. ఈ మేరకు సంఘ ప్రతినిధులు జె.ప్రసాదరావు, గుడ్డిభద్ర వేణు, మాదిన రామారావు గురువారం తహశీల్దార్ హైమావతికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి ఏటా ఒడిశా నుంచి మండల సరిహద్దుల ద్వారా ఒడిశా ధాన్యం అక్రమంగా రవాణా అవుతున్నయని, దీనివల్ల స్థానిక రైతులకు తమ ధాన్యం అమ్ముకునే పరిస్థితులు లేకుండా పోతున్నాయి అన్నారు. కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు పండి దేవేంద్రమూర్తి, కె.ఉమాపతి, ఆనందరాజు, కృష్ణారావు, లక్ష్మీనారాయణ, జగన్నాథరావు తదితరులు పాల్గొన్నారు.

ప్రత్యేక కాలువ నిర్మించాలి


చెరువు వద్ద ప్రజాప్రతినిధులతో చర్చిస్తున్న సత్యనారాయణ

సంతబొమ్మాళి: కొల్లిపాడు రామ సాగర్ చెరువు నుండి ప్రత్యేక కాలువ నిర్మాణం చేపట్టాలని వైస్ ఎంపిపి ప్రతినిధి నక్క భీమారావు వంశధార డిఇ సత్యనారాయణను కోరారు .ఈ కాలువ నిర్మాణం చేస్తే రైతులకు ఎటువంటి ఇబ్బంది లేకుండా మూలపేట వరకు సకాలంలో సాగునీరు అందించడానికి వీలవుతుందని అన్నారు. గురువారం ఆయన గొదలాం దగ్గర ఉన్న గరిబీల గెడ్డ వద్ద కొత్తగా లిఫ్ట్ ఇరిగేషన్ నిర్మాణం కోసం ఆ ప్రదేశాన్ని పరిశీలించారు. అనంతరం ఆర్.సున్నాపల్లి నుండి కొల్లిపాడు వరకు గతంలో చేసిన పనులు పరిశీలించారు. కార్యక్రమంలో మేఘవరం సర్పంచ్ ప్రతినిధి పరపటి శ్రీనివాస్‌రెడ్డి, కొల్లిపాడు సర్పంచ్ ప్రతినిధి గొరుసు సవరయ్య, జిల్లా మత్స్యకార సహకార సంఘం డైరెక్టర్ సూరాడ జోగారావు, వంశధార జెఇ అప్పలరెడ్డి, లస్కర్ వీరాస్వామి పాల్గొన్నారు.

తేలుకుంచిలో 'గడప గడపకు'

ఇచ్ఛాపురం: ప్రతి ఒక్కరూ సంతోషంగా ఉండాలన్న లక్ష్యంగా చేసుకుని అనేక సంక్షేమ పథకాలు ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి అమలు చేస్తున్నారని వైసిసి సమన్వయ కర్త పిరియ సాయిరాజ్ అన్నారు. గడప గడపకు కార్యక్రమం సందర్భంగా గురువారం రెండవ రోజు తెలుకుంచి గ్రామంలో విస్తతంగా పర్యటించారు. కార్యక్రమంలో వైసిపి నాయకులు బోర పుష్ప, దుక్క లోకేశ్వర్‌రెడ్డి, నారాయణమ్మ, సుగుణ, రాజశేఖర్‌రెడ్డి, దేవదాస్‌రెడ్డి, నూకయ్యరెడ్డి, రాజారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.


ప్రభుత్వ పథకాలను వివరిస్తున్న సాయిరాజ్


ప్రారంభిస్తున్న సర్పంచ్ రజని

బారువలో భూ రీ సర్వే ప్రారంభం

ప్రజాశక్తి- సోంపేట

మండలంలోని బారువ గ్రామంలో గురువారం సర్పంచ్ ఎర్ర రజని ఆధ్వర్యంలో భూ రక్ష, భూ రీ సర్వే కార్యక్రమం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈ కార్యక్రమం వల్ల రైతులకు ఎంతో మేలు జరుగుతుందన్నారు. దీనివల్ల ఎటువంటి అవకతవకలకు అవకాశం ఉండదన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపిపి గొర్రెల శ్రీను, ఎంపిటిసిలు బుచ్చి, చంద్రశేఖర్, రైతులు సత్యం, వర్మ తదితరులు పాల్గొన్నారు.


శిక్షణ ఇస్తున్న వెంకటరమణ

నీటి అవసరాలపై శిక్షణ

ప్రజాశక్తి- బూర్జ

మండలంలోని లక్కుపురంలో నీటి అవసరాలపై బ్రెడ్స్ సంస్థ ప్రతినిధి వెంకటరమణ రైతులకు క్రాఫ్ ప్లానింగ్, నీటి బడ్జెట్‌పై గురువారం శిక్షణ ఇచ్చారు. ఎపి బేడ్స్ సమీకృత సాగునీరు, వ్యవసాయ పరివర్తన పథకం నేతృత్వంలో ప్రభుత్వం, ప్రపంచ బ్యాంకు సహకారంతో క్రాప్‌ప్లాన్, నీటి బడ్జెట్ అంశంపై వివరించారు. పంటల రకాలు, సాగునీటి అవసరం, వ్యాపార పంటలుగా మార్చేందుకు భూగర్భ జలాలు వంటి అంశాలపై చర్చించారు. కార్యక్రమంలో జెడ్‌పిటిసి బెజ్జిపురం రామారావు, ఎంపిపి ప్రతినిధి కర్నేని నాగేశ్వరరావు, గ్రౌండ్ వాటర్ ఎడి రమణ, ఎపిడి లక్ష్మణరావు, కార్యదర్శి, వాలంటీర్లు పాల్గొన్నారు.